మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
PRGI REGD NO: TGTEL/25/A1385
NETI EVARTHALU దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 11-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 43 Issue: 43

Circulated to Telangana
Published from Jagitial

శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:01 సూర్యాస్తమయం - సా. 6:40 తిథి చతుర్దశి రా. 1:540 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పునర్వసు ఉ. 10:07 వరకు తరువాత పుష్యమి యోగం సిద్ధి సా. 6:48 వరకు కరణం విష్టి మ. 3:24 వరకు శకుని రా. 1:540 వరకు వర్జ్యం సా. 5:26 నుండి సా. 6:53 వరకు దుర్ముహూర్తం ఉ. 8:33 నుండి ఉ. 9:24 వరకు రా. 11:13 నుండి రా. 11:58 వరకు రాహుకాలం మ. 3:31 నుండి సా. 5:05 వరకు యమగండం ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:21 నుండి మ. 1:56 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:25 నుండి తె. 5:13 వరకు అమృత ఘడియలు ఉ. 7:58 నుండి ఉ. 9:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున





# కొలంబియా కకావికలం

## 69 మందికిపైగా దుర్మరణం

### కుదిపేసిన భారీ భూకంపం.. వేలాది భవనాలు నేలమట్టం

### శిథిలాల కింద వందల మంది.. 7.4 తీవ్రతతో భారీ భూకంపం



కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనలతో 69 మందికి పైగా మరణించారు. వందల మంది గాయపడ్డారు. అనేక భవనాలు పేకమేడల్లా కూలిపోవడంతో శిథిలాల కింద చాలామంది చిక్కుకుని ఉండొచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బొగోటా: మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం చోకో ప్రాంతంలోని శాన్ జోస్ డెల్ పల్మార్ పట్టణానికి సమీపంలో, భూమికి సుమారు 107 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. భూకంప తీవ్రతకు -2 వ పేజీలో...




# జాతీయ హోదా ఇవ్వం

## అలాంటి ప్రతిపాదన మా పరిశీలన లేదు

### స్పష్టం చేసిన కేంద్ర జలశక్తి శాఖ

### సమగ్ర ప్రణాళికతో రావాలని సూచన

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్ర జలశక్తి శాఖ స్పష్టం చేసింది. అంతేకాకుండా.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 పరిధిలో ఉండటంతో ప్రస్తుత దశలో ప్రాజెక్టుకు టెక్నో ఎకనామిక్ అప్రైజల్ నిర్వహించలేమని వెల్లడించింది.

న్యూఢిల్లీ:ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన పలు అంశాలపై కేంద్రాన్ని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి.. లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల అంశాలతో ముడిపడి ఉన్న, గణనీయమైన సాగునీటి సామర్థ్యాన్ని సృష్టించే భారీ సాగునీటి ప్రాజెక్టులకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం జాతీయ ప్రాజెక్టు హోదా తరువాయి 2 వ పేజీలో...

# బారికేడ్లు బద్దలు

- జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలు ఉద్రిక్తం
- అడ్డుకొనేందుకు వాటర్ కేనన్ల ప్రయోగం
- పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తునకు డిమాండ్
- 13 పరీక్షలను రద్దు చేయాలని ఉడుం పట్టు



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,197 |
| వెండి (కిలో): | రూ.2,50,900 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,371 |

# 71 లక్షల ఓట్లు గాయబ్?

### 9.1 లక్షల మంది మరణం.. 6.6 లక్షల డూప్లికేట్ ఓట్లు

### టీజీలో ముగిసిన సర్ గడువు.. తుది జాబితాపై తీవ్ర ఉత్కంఠ



తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో కీలక ఘట్టం ముగిసింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఇచ్చిన గడువు నేటితో ముగిసింది. దీంతో రాష్ట్రంలో దాదాపు 71 లక్షల మంది ఓటర్ల వివరాలపై ఇప్పుడు తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఓటర్లను అన్‌కలెక్టబుల్ కేటగిరీలో గుర్తించిన నేపథ్యంలో.. తుది ఓటర్ల జాబితాలో వీరి పేర్లు కొనసాగుతాయా లేక తొలగిస్తారా అనేది కీలకంగా మారింది.

హైదరాబాద్, ఆగస్టు 10 (ఈవార్తలు): తెలంగాణలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. సుమారు 70.8 లక్షల మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు అందుబాటులో లేని లేదా సేకరించలేని కేటగిరీలో ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడించాయి. ఈ సంఖ్య రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 21 శాతానికి సమానమని ఎన్నికల సంఘం గణాంకాలు పేర్కొంటున్నాయి. వీరిలో సుమారు 9.1 లక్షల మంది మరణించినవారు ఉండగా.. 10.3 లక్షల మంది గైర్హాజరు లేదా ఆచూకీ లభించని వారిగా గుర్తించారు. మరో 43 లక్షల మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలిపోయినట్లు.. 6.6 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఇప్పటికే అన్‌కలెక్టబుల్ కేటగిరీలోకి వచ్చే ఓటర్ల పేర్లను తొలగించే ప్రక్రియ ఉంటుందని తెలంగాణ ప్రధాన ఎన్నికల తరువాయి 2 వ పేజీలో...



# వరుణ యాగం సంపూర్ణం

## సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

### యాదగిరిగుట్ట పండితుల ఆధ్వర్యంలో 11 హోమగుండాలతో యాగం

నాగార్జునసాగర్, ఆగస్టు 10 (ఈవార్తలు): తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




మన్నికైన ప్లాస్టిక్‌ను సైతం తినేసి, దానిని విచ్ఛిన్నం చేయగల ఒక ప్రత్యేకమైన శిలీంధ్రాన్ని (ఫంగస్) పాకిస్తాన్‌లో శాస్త్రవేత్తలు గుర్తించారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మున్సిపల్ చెత్తకుప్ప నుంచి సేకరించిన మట్టి నమూనాలలో ఈ ఫంగస్‌ను కనుగొన్నారు. 'అస్పెర్‌గిల్లస్ ట్యూబింజెన్సిస్'గా పిలిచే ఈ ఫంగస్, పాలియురేథేన్ ప్లాస్టిక్‌ను సమర్థంగా నాశనం చేయగలదని తేల్చారు.




# 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- ప్రతిపక్ష హోదా ఇవ్వనందున అసెంబ్లీకి దూరంగా వైసీపీ
- మండలి సమావేశాలకు మాత్రం హాజరుకానున్న విపక్షం
- డీఎస్సీ అక్రమాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు వ్యూహం

అమరావతి, ఆగస్టు 10 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఆగస్ట్ 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. -2 వ పేజీలో...



# 21 మంది తెలుగు యువతుల అరెస్ట్

### ఢిల్లీ కేంద్రంగా భారీ మోసం గుట్టురట్టు.. ఫేక్ కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆగస్టు 10 (ఈవార్తలు): ఢిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మూడు మోసపూరిత కాల్ సెంటర్లపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. బజాజ్ ఫైనాన్స్ పేరుతో రుణాలు ఇస్తామని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించి 22 మందిని అదుపులోకి తీసుకున్నారు తరువాయి 2 వ పేజీలో...

# 15 తర్వాత యుద్ధమే!

## ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం ఉధృతం

### టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు ప్రకటన



హైడ్రా పనితీరుపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్ రావు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హైడ్రా అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని, న్యాయస్థానాలను సైతం పక్కదారి పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. సల్కమ్ చెరువు పరిధిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై స్పష్టమైన ఆధారాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ హైడ్రా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రాంచందర్ రావు మండిపడ్డారు.

హైదరాబాద్, ఆగస్టు 10 (ఈవార్తలు): పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం అన్నట్లుగా అధికారుల తీరు ఉందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ భూములను, చెరువులను ఎవరు కబ్జా చేసినా బీజేపీ ఊరుకోదని, ప్రజాధనాన్ని, ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు రాజీలేని పోరాటం తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

11.8.2026

మేషం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. జీవిత భాగస్వామితో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. బంధు మిత్రుల ఆదరణ పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆటుపోట్లు తొలగుతాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు.

వృషభం: వృత్తి ఉద్యోగాలలో మీ ప్రతిభా పాటవాలు వెలుగులోకి వస్తాయి. ఆప్తుల నుండి కీలక సమాచారం అందుతుంది. అనుకున్న పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగులు శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక పురోగతి కలుగుతుంది.

మిథునం: ఋణదాతల ఒత్తిడి పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకోడిగా సాగుతాయి. తొందరపడి ఇతరులతో మాట్లాడటం మంచిది కాదు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక నష్టాలు తప్పవు. ఉద్యోగమున అధికారుల ఆగ్రహానికి గురవుతారు. సంతాన అనారోగ్య సమస్యలుంటాయి.

కర్కాటకం: కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. సమాజంలో ప్రముఖుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరపు బంధువుల ఆగమనంతో గృహమున సందడి వాతావరణం ఉంటుంది. వృత్తి , వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి.

సింహం: నూతన వాహన యోగం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. చేపట్టిన పనులలో అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

కన్య: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆకస్మిక మార్పులుంటాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఖర్చుకు తగినంత ఆదాయం ఉండదు. వృథా ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారంలో భాగస్థులతో విభేదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని బారం తప్పదు.

తుల: ఆదాయ వ్యవహారాలు ఉత్సాహాన్నిస్తాయి. ఇంటా బయట విషయాలలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. కొన్ని వ్యవహారాలలో కుటుంబ సభ్యులు సలహాలు కలసివస్తాయి. సేవా కార్యక్రమాలకు సహాయం అందిస్తారు. స్థిరాస్తి క్రయ విక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో వివాదాలు పరిష్కారమవుతాయి.

వృశ్చికం: ముఖ్యమైన వ్యవహారాలు వ్యయప్రయాసలతో కాని పూర్తికావు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. అవసరానికి ధనం చేతిలో నిల్వ ఉండదు. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులుంటాయి. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. ఉద్యోగాలలో శ్రమ తప్పదు.

ధనస్సు: నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వృత్తి ఉద్యోగాలలో కష్టానికి తగిన ఫలితం పొందుతారు. నూతన గృహం కొనుగోలు ప్రయత్నాలకు ఆటంకాలు తొలగుతాయి. ధన పరంగా మరింత పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

మకరం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగాలలో మీ నిర్ణయాలకు తగిన ప్రశంసలు అందుకుంటారు. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారమునకు పెట్టుబడులు అందుతాయి.

కుంభం: మీ ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఋణ దాతల ఒత్తిడి పెరుగుతుంది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగాలు నిరుత్సాహపరుస్తాయి.

మీనం: ఇతరులకు మాట ఇచ్చే విషయంలో జాగ్రత్త వహించాలి. పనులలో శ్రమ పెరుగుతుంది. ధనపరమైన ఇబ్బందులు తప్పవు. ఆరోగ్యం సహకరించక చికాకు పెరుగుతుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులతో మనస్పర్థలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చికాకులు ఉంటాయి.



# బారికేడ్లు బద్దలు

### జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళనలు ఉద్రిక్తం.. అడ్డుకొనేందుకు వాటర్ కేనన్ల ప్రయోగం

### పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తునకు డిమాండ్.. 13 పరీక్షలను రద్దు చేయాలని ఉడుం పట్టు

రాంచీ: ఉద్యోగ నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా మారింది. రాంచీలో అసెంబ్లీ వైపు వెళ్లేందుకు విద్యార్థులు బారికేడ్లను దాటడంతో పోలీసులు వాటర్ కేనన్లు ప్రయోగించారు. నియామక పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీక్‌లతో తమ భవిష్యత్తు దెబ్బతింటోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం వేలాది మంది రాంచీకి తరలివచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి రైళ్లు, బస్సులు, ఇతర వాహనాల్లో రాజధానికి చేరుకున్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరే ముందు విద్యార్థి నేత దేవేంద్ర మహతో కీలక సూచన చేశారు. పోలీసులు అడ్డుకున్నప్పుడు వారితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. క్రమశిక్షణతో మరో మార్గం ద్వారా అసెంబ్లీకి చేరేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల మార్చ్ నేపథ్యంలో రాంచీలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా సరిహద్దులు, ప్రధాన రహదారులు, హైవేలపై బస్సులు, ప్రైవేటు వాహనాలను తనిఖీ చేశారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు. రాంచీలో చాలా పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 13 పరీక్షలను రద్దు చేసి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో ఇప్పటికే ఆరు దఫాలుగా చర్చలు జరిగినా పరిష్కారం కాలేదు. తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించామని ప్రభుత్వం చెబుతోంది. అయితే 13 పరీక్షల్లో కేవలం మూడింటినే రద్దు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని విద్యార్థులు అంటున్నారు. ఆందోళనలో భాగంగా ఆరుగురు విద్యార్థులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.



# వరుణ యాగం సంపూర్ణం

**మొదటి పేజీ తరువాయి**

జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## 71 లక్షల ఓట్లు గాయబ్?

**మొదటి పేజీ తరువాయి**

అధికారి సీ. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే గడువు ముగియగా.. ప్రక్రియ పూర్తి అయ్యే సమయానికి మరిన్ని ఎన్యుమరేషన్ ఫారాలు అందే అవకాశం ఉండటంతో తుది తొలగింపు సంఖ్యలో మార్పు రావచ్చని భావిస్తున్నారు. ఆగస్ట్ 9వ తేదీ నాటికి సుమారు 3.2 లక్షల ఫారాలు మాత్రమే డిజిటలైజ్ కావాల్సి ఉండగా.. మిగిలిన ప్రక్రియను అధికారులు పూర్తి చేయనున్నారు. ఎస్ఐఆర్‌లో అత్యధికంగా అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదైన ప్రాంతంగా గ్రేటర్ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం నిలిచింది. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాలు కలిపి సుమారు 41.5 లక్షల అన్‌కలెక్టబుల్ ఫారాలు నమోదు అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 70.8 లక్షలతో పోలిస్తే ఇవి దాదాపు 58.6 శాతానికి సమానం. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల వివరాలను సేకరించడంలో అనేక ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉండేవారు తరచూ ఇళ్లను మార్చడం.. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం.. మూసివేసిన ఇళ్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ఓటర్లను గుర్తించడం కష్టంగా ఉండటం, మరణించిన ఓటర్ల పేర్లు కొనసాగడం వంటి కారణాలు అన్‌కలెక్టబుల్ కేసులు పెరగడానికి కారణాలుగా కనిపిస్తున్నాయి. మరోవైపు ఉత్తర, పశ్చిమ తెలంగాణలో ఓటర్ల వివరాల్లో అనామలీస్ (వివరాల్లో తేడా ఉండటం) శాతం ఎక్కువగా నమోదైంది. జిల్లా స్థాయిలో ఆదిలాబాద్‌లో 28.5 శాతం ఓటర్ల వివరాల్లో అనామలీస్ గుర్తించారు. నిజామాబాద్‌లో 27.4 శాతం, నిర్మల్‌లో 26.1 శాతం, మెదక్‌లో 24.6 శాతం, కామారెడ్డిలో 23.9 శాతం, సంగారెడ్డిలో 23.8 శాతం నమోదు అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే ఆదిలాబాద్‌లో 30.4 శాతం అనామలీస్‌తో అత్యధికంగా ఉండగా.. నారాయణఖేడ్‌లో 29.3 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 28.4 శాతం, షాద్‌నగర్‌లో 28.3 శాతం, నిర్మల్‌లో 28.29 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 28.1 శాతం నమోదయ్యాయి.

## 17 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి**

అయితే, ప్రతిపక్ష హోదా వివాదం నేపథ్యంలో ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నోటిఫికేషన్ ప్రకారం, ఆగస్ట్ 17న ఉదయం 9 గంటలకు శాసనసభ, ఉదయం 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకే పరిమితమైన వైసీపీకి ప్రతిపక్ష నేత (ఎల్‌ఓపీ) హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, తమ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఎల్‌ఓపీ హోదా కల్పించనంత వరకు అసెంబ్లీకి హాజరయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ ఇప్పటికే స్పష్టం చేసింది. ప్రజల గొంతుకను బలంగా వినిపించాలంటే ప్రతిపక్ష హోదా తప్పనిసరి అని, ప్రజాస్వామ్యాన్ని గౌరవించకపోవడం వారి అవివేకమే అవుతుందని జగన్ గతంలో వ్యాఖ్యానించారు. ఈ హోదాకు సంబంధించిన అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ దశలో ఉంది. అయితే, అసెంబ్లీకి దూరంగా ఉన్నప్పటికీ శాసనమండలి సమావేశాలకు మాత్రం హాజరు కావాలని వైసీపీ నిర్ణయించింది. మండలిలో తమకు పూర్తి మెజారిటీ ఉండటంతో, వివిధ ప్రజా సమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా, మెగా డీఎస్సీ-2025లో చోటుచేసుకున్నాయని ఆరోపిస్తున్న అక్రమాలపై మండలిలో గళం విప్పనుంది. ఈ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, పారదర్శక దర్యాప్తు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. అయితే, తాము డీఎస్సీ పరీక్షను రద్దు చేయాలని గానీ, ఇప్పటికే నియామకమైన అభ్యర్థులను తొలగించాలని గానీ కోరడం లేదని వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

## కొలంబియా కకావికలం

**మొదటి పేజీ తరువాయి**

పెరీరా, కాలి, క్విబ్డో, మనీజల్స్ వంటి నగరాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క పెరీరా నగరంలోనే 18 మంది మరణించినట్లు ఆ నగర మేయర్ మౌరిసియో సలాజర్ తెలిపారు. మనీజల్స్‌లోని చారిత్రక నియో-గోతిక్ కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. భూకంపం ప్రభావం పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పెరీరా, మనీజల్స్, క్విబ్డో సహా ఆరు విమానాశ్రయాలు దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించాయి. రాజధాని బొగోటాలోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. కొలంబియా అధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా.. సహాయక చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ విపత్తు నిర్వహణ విభాగంలో యూనిఫైడ్ కమాండ్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి, నష్టాన్ని అంచనా వేయాలని, బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. 'ఈ కష్టకాలంలో ఉన్న కొలంబియా ప్రజలకు నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఒంటరి కాదు. ప్రభుత్వం మీకు అండగా ఉంది. ప్రభావిత ప్రాంతాల పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతి చర్యా తీసుకుంటాం' అని భరోసా ఇచ్చారు.

## 21 మంది తెలుగు యువతుల అరెస్ట్

**మొదటి పేజీ తరువాయి**

వీరిలో 21 మంది తెలుగు యువతులు, ఒక బ్యాంకు ఖాతాదారుడు ఉన్నారు. గత 18 నెలలుగా ఈ ముఠా చురుకుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్ ప్రతినిధులుగా ఫోన్లు చేసి, ఆకర్షణీయమైన రుణాలను ఆమోదించినట్లు నమ్మించేవారు. ఆ తర్వాత ప్రాసెసింగ్ ఫీజులు, వెరిఫికేషన్ చార్జీలు, డాక్యుమెంటేషన్, ఇన్సూరెన్స్ వంటి పేర్లతో బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు. ఈ మోసాలకు పాల్పడేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా తెలుగు మాట్లాడే యువతులనే నియమించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా కోరుట్ల, హైదరాబాద్‌లోని సైదాబాద్, బోరబండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి యువతులను టెలీకాలర్లుగా రిక్రూట్ చేసుకున్నారు. లలిత్ సింగ్, కుల్దీప్ సింగ్, అనిల్ అనే ముగ్గురు వ్యక్తులు ఢిల్లీలోని శివ మార్కెట్ కేంద్రంగా ఈ కాల్ సెంటర్లను నడిపిస్తున్నారని, ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ముఠాకు సంబంధించి తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 22 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఆపరేషన్ సందర్భంగా 23 మొబైల్ ఫోన్లు, రెండు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

## 'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వం

**మొదటి పేజీ తరువాయి**

పరిశీలిస్తామని కేంద్రం తెలిపింది. అయితే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని స్పష్టం చేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కి అందిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే ఈ ప్రాజెక్టులో కృష్ణా నదీ జలాల వినియోగంతో పాటు అంతర్రాష్ట్ర అంశాలు ముడిపడి ఉన్నాయని పేర్కొంది. ఈ అంశాలు కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 పరిధిలో ఉన్నందున ప్రస్తుతం న్యాయపరమైన పరిశీలనలో ఉన్నాయని కేంద్రం తెలిపింది. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్టుకు అవసరమైన టెక్నో-ఎకనామిక్ అప్రైజల్‌ను ప్రస్తుత దశలో చేపట్టడం సాధ్యం కాదని కేంద్రం స్పష్టం చేసింది. అటు.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉద్దేశించిన ప్రయోజనాలను సాధించేలా మరింత సమగ్ర ప్రణాళికతో రావాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించినట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు ప్రాజెక్ట్ డీపీఆర్‌ను రాష్ట్రానికి తిరిగి పంపినట్లు వెల్లడించింది. ప్రాజెక్టులో టెక్నికల్ పరిశీలన, ఇతర అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు పూర్తయిన తర్వాతే తదుపరి దశల పరిశీలన సాధ్యమవుతుందని పేర్కొంది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ఎంత ఆర్థిక సహాయం అందించవచ్చన్న అంశంపై కూడా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ప్రాజెక్టు ద్వారా ఎంత సాగునీటి సామర్థ్యం ఏర్పడుతుంది? కరువు నివారణకు ఎంత ప్రయోజనం ఉంటుంది? తాగునీటి అవసరాలకు ఎంత మేర ఉపయోగపడుతుంది? వంటి అంశాలపై కూడా కేంద్రం తన సమాధానంలో నిర్దిష్ట మొత్తాలను వెల్లడించలేదు.

## 15 తర్వాత యుద్ధమే!

**మొదటి పేజీ తరువాయి**

చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, కబ్జాలపై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆగస్టు 15వ తేదీ తర్వాత హైడ్రా, క్యూర్ పరిధులు, బాధ్యతలపై ప్రత్యేక సెమినారు నిర్వహించనున్నారు. సెమినార్ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై, కబ్జాలకు వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేయనున్నట్లు ప్రకటించారు. పార్టీ సంస్థాగత మార్పులు, రాబోయే ఎన్నికలపై స్పందిస్తూ... నిబంధనల ప్రకారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పదవీకాలం రెండేళ్లు పూర్తయిన తర్వాత తప్పకుండా నూతన అధ్యక్షుడిని నియమిస్తారని తెలిపారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న విచారణలు, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే రాజధానిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

# 50 ఏళ్ల తర్వాత కర్రెగుట్టలో శాంతి

## పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: డీజీపీ సీవీ ఆనంద్



ములుగు, ఆగస్టు 10 (ఈవార్తలు): ఒకప్పుడు మావోయిస్టుల ప్రధాన స్థావరంగా పేరు గాంచిన తెలంగాణ--ఛత్తీస్‌గఢ్--ఒడిశా సరిహద్దులోని కర్రెగుట్ట ఇప్పుడు శాంతి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం కర్రెగుట్టలో పర్యటించిన ఆయన అక్కడ జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, శాంతికి ప్రతీకగా తెల్ల పావురాలను ఎగురవేశారు. పోలీసు, సీఆర్పీఎఫ్, అటవీ, రెవెన్యూ తదితర శాఖల ఉన్నతాధికారులతో కలిసి ప్రాంతాన్ని పరిశీలించిన డీజీపీ, దశాబ్దాలుగా మావోయిస్టు ప్రభావానికి గురైన ఈ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి బాట పట్టిందన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. తెలంగాణ పోలీసులు, గ్రేహౌండ్స్, ప్రత్యేక పోలీసు బలగాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సమన్వయం వల్ల ఆపరేషన్ కగార్ చర్యల ఫలితంగానే మావోయిజమంతమైందన్నారు. ఆపరేషన్ కగార్‌లో సుమారు 700 మంది మావోయిస్టులు లొంగిపోయారని, పలువురు అగ్రనేతలు ఎన్‌కౌంటర్లలో మృతిచెందగా మరికొందరు సాధారణ జీవితంలోకి వచ్చారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి ప్రభుత్వం ఆర్థిక సాయం, భూముల కేటాయింపు, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, వారు సమాజంలో కలిసిపోయేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. కర్రెగుట్టకు పర్యాటకంగా అపార అవకాశాలున్నాయని, పర్యావరణ, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా దీనిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని డీజీపీ తెలిపారు. పామూరు నుంచి చలమడ వరకు తారు రోడ్డు పనులు పూర్తయ్యాయని, త్వరలోనే బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్‌తోపాటు ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించి ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. పామూరు శిబిరం సమీపంలోని గుత్తికోయ కుటుంబాలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేసిన డీజీపీ, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మావోయిస్టు వ్యతిరేక పోరాటంలో సీఆర్పీఎఫ్ పాత్రను డీజీపీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కుటుంబాలకు నెలల తరబడి దూరంగా ఉండి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్న సీఆర్పీఎఫ్ 196 బెటాలియన్ సిబ్బంది సేవలు శాంతి పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. ఈ పర్యటనలో అదనపు డీజీపీ సంజయ్ జైన్, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఎస్ఐబీ ఎస్పీ సింధు శర్మ, ములుగు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, సీఆర్పీఎఫ్ అధికారులు, రెవెన్యూ, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మావోయిస్టు గణపతి లొంగిపోవాలి**

మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ ము ప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, ఆయ న భార్యతో పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న సీనియర్ నాయకత్వం హింసా మార్గాన్ని వీడి లొంగిపోవాలని డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టుల పునరావా సంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తోందని తెలిపారు. సరెండర్ అయిన వారికి ఆర్థిక సాయం, సా మాజికంగా స్థిరపడేందుకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి హామీ మేరకు ఉచిత వైద్య చికిత్స కోసం ఆరోగ్య రక్షణ కార్డులు జారీ చేసి పంపిణీ చేసినట్లు వెల్లడించారు.

# 9 మంది జలసమాధి

## వాగులో కొట్టుకుపోయిన వ్యాన్.. మధ్యప్రదేశ్‌లో విషాదం

రాజ్‌గఢ్: మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో సోమవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఓ వ్యాన్ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులో కొట్టుకుపోవడంతో ముగ్గురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా ఈది ఒడ్డుకు చేరుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, దేవస్ జిల్లా ధన్‌సద్ గ్రామానికి చెందిన 11 మంది ప్రయాణికులు ఓ వ్యాన్‌లో కడ్లవాడ్‌కు వెళుతున్నారు. పచోర్–సారంగ్‌పూర్ రహదారిపై పాడ్నా సమీపంలో ఉదయం 9:30 గంటల సమయంలో ఝిరి వాగు వద్దకు చేరుకున్నారు. భారీ వర్షాలకు వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి ప్రవహిస్తోంది. వాగు దాటవద్దని స్థానిక గ్రామస్థులు, అధికారులు హెచ్చరించినా డ్రైవర్ వినిపించుకోలేదు. వ్యాన్‌ను ముందుకు నడపడంతో బలమైన నీటి ప్రవాహానికి అది కొట్టుకుపోయి క్షణాల్లో మునిగిపోయింది. సమాచారం అందుకున్న రాష్ట్ర విపత్తు స్పందన దళం ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో వ్యాన్‌ను బయటకు తీసింది. ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ ముఖేష్ సింగ్, మరో ప్రయాణికుడు హుకుమ్ సింగ్ ప్రాణాలతో బయటపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన చోట వంతెన నిర్మాణంలో ఉందని, దానిపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతోనే ఈ దుర్ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల నదులు, వాగులు పొంగిపొర్లుతున్నాయి.

# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ: యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు. గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు. మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్–టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

# మహిళల దుస్తులు వారి వ్యక్తిగత స్వేచ్ఛ

న్యూఢిల్లీ: మహిళలు ధరించే దుస్తులు వారి వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన అంశమని, వాటిని సాకుగా చూపి లైంగిక వేధింపులకు పాల్పడటాన్ని ఏమాత్రం సహించలేమని ఢిల్లీ హైకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఒక యువతిని లైంగికంగా వేధించిన కేసులో ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ, నిందితుడిని దోషిగా నిర్ధారించింది. సాజిద్ అలీ అనే వ్యక్తి ఒక యువతిని కొంతకాలంగా వెంబడించడం, అసభ్యకరంగా మాట్లాడటంతో పాటు ఆమెను భౌతికంగా తాకుతూ వేధింపులకు పాల్పడ్డాడు. ఈ కేసును విచారించిన ట్రయల్ కోర్టు నిందితుడిని నిర్దోషిగా విడుదల చేసింది. అయితే, ఆ తీర్పును సవాలు చేస్తూ బాధితురాలు హైకోర్టును ఆశ్రయించింది. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ చంద్రశేఖరన్ సుధ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం, నిందితుడిని దోషిగా ఖరారు చేసింది. బాధితురాలు జీన్స్ ధరించడంపై నిందితుడి తరఫు న్యాయవాది అడిగిన ప్రశ్నలను విచారణ సందర్భంగా కోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. "ఒక మహిళ ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విషయం.

# శ్రీవారి సేవకు రూ.15 లక్షల ట్రక్

తిరుమల, ఆగస్టు 10 (ఈవార్తలు): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సోమవారం ఓ భారీ విరాళం అందింది. తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర మోటార్స్ సంస్థ, టీటీడీ రవాణా అవసరాల నిమిత్తం తమవంతు సహాయంగా ఓ నూతన ట్రక్కును విరాళంగా అందించింది. సుమారు రూ.15.24 లక్షల విలువైన ఈ ఎస్.ఎం.ఎల్. మహీంద్రా ట్రక్కును సంస్థ మేనేజింగ్ పార్టనర్ లోకనాథ రెడ్డి అందజేశారు. సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు దాత లోకనాథ రెడ్డి కుటుంబ సమేతంగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, వాహనానికి సంబంధించిన తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథంకు భక్తిశ్రద్ధలతో అందజేశారు. శ్రీవారి సేవలకు భక్తులు నగదు, బంగారం వంటి కానుకలతో పాటు, ఇలా వాహనాలను కూడా విరాళంగా అందిస్తుండటం తెలిసిందే. ఈ ట్రక్కును టీటీడీ తన రవాణా అవసరాల కోసం వినియోగించనుంది.

# తెలంగాణలో పవన్ పోటీ చేయాలి

## ఎమ్మెల్యే రాజాసింగ్ సూచన



హైదరాబాద్, ఆగస్టు 10 (ఈవార్తలు): జనసేన పార్టీ, ఆ పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రానున్న మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేయాలని.. అందుకు చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను కోరారు. తెలంగాణలో జనసేనకు మంచి రాజకీయ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్‌కు తెలంగాణ యూత్‌లో ఉన్న ఫాలోయింగ్‌ను ఉపయోగించుకుని జనసేన పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఓ వీడియోను విడుదల చేసిన రాజాసింగ్ .. పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి తన అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణలో జనసేన అన్ని స్థానాల్లో పోటీ చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ.. బలమైన రాజకీయ, ప్రజల మద్దతును సాధించిందని పేర్కొన్నారు. అదే విధంగా తెలంగాణలోనూ పవన్ కళ్యాణ్‌కు ఉన్న క్రేజ్, ముఖ్యంగా యువతలో ఉన్న అభిమానాన్ని దృష్టిలో ఉంచుకుని జనసేన ఇక్కడ రాజకీయంగా క్రియాశీలకంగా మారాలని సూచించారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనను.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను చూశారని రాజాసింగ్ విమర్శించారు. ఈ 2 ప్రభుత్వాల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని.. ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. తెలంగాణలోని అన్ని స్థానాల్లో జనసేన పోటీ చేస్తే ఆ పార్టీకి మంచి భవిష్యత్ ఉంటుందని రాజాసింగ్ తన అభిప్రాయం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల నాటికి జనసేన నాయకుడు తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యే అవకాశం కూడా ఉందంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే ఇవి తన వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమేనని.. పవన్ కళ్యాణ్‌కు తాను చేస్తున్న విజ్ఞప్తిగా భావించాలని రాజాసింగ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తెలంగాణ బీజేపీ నాయకత్వంపైనా రాజాసింగ్ తన అసంతృప్తిని మరోసారి వ్యక్తం చేశారు. 2014 నుంచి పార్టీలో కొందరు నాయకులు అనుసరిస్తున్న కాంప్రమైజ్ రాజకీయాల వల్ల బీజేపీ తీవ్రంగా నష్టపోయిందని ఆరోపించారు. పార్టీ కోసం పనిచేసి ఉంటే ఇప్పటికే తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉండేదని పేర్కొన్నారు. పార్టీ క్యాడర్‌ను పట్టించుకోకుండా సీనియర్ నాయకులను పక్కన పెట్టడం.. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అంశాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి

**కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత**

**ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ హితవు**

హనుమకొండ, ఆగస్టు 10 (ఈవార్తలు): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు. మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీ యాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు.



# సిరిసిల్లలో కదం తొక్కిన కార్మికులు.. అంబేద్కర్ చౌక్ వద్ద భారీ రాస్తారోకో

రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 10 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు కార్మికులు భారీ ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి మోసం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని ఆరోపించారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర కల్పించడంలో కేంద్రం విఫలమైందని, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని, లేనిపక్షంలో కార్మిక వర్గం ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# బాలినేని, దామచర్లపై కూటమి సీరియస్

**తీవ్రంగా స్పందించిన టీడీపీ, జనసేన అధిష్టానాలు**

**సంయమనం పాటించాలని ఇద్దరు నేతలకు సూచన**

ఒంగోలు, ఆగస్టు 10 (ఈవార్తలు): ఒంగోలు వేదికగా జనసేన నాయకుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మధ్య చోటుచేసుకుంటున్న మాటల యుద్ధంపై టీడీపీ, జనసేన పార్టీల అధిష్ఠానాలు తీవ్రంగా స్పందించాయి. నేతలిద్దరూ సంయమనం పాటించాలని, బహిరంగ విమర్శలకు దూరంగా ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాయి. ఈ వ్యవహారం కూటమి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని భావించిన ఇరు పార్టీల అగ్రనేతలు తక్షణమే రంగంలోకి దిగారు. ఈ పరిణామాలపై కూటమి సమన్వయ కమిటీ సభ్యులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సమావేశంలో టీడీపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలుంటే పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకురావాలి తప్ప, బహిరంగ విమర్శలకు దిగడం కూటమి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని వారు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తో నేరుగా మాట్లాడారు. సంయమనం పాటించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. అటు జనసేన నేతలు కూడా బాలినేనితో మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గంలో భూములు, ఇసుక, రేషన్ పంపిణీలో జరుగుతున్న అక్రమాల్లో ఎమ్మెల్యేకు భాగస్వామ్యం ఉందని, దీనిపై విచారణ జరిపించాలని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ విమర్శలపై దామచర్ల జనార్ధన్ ధీటుగా స్పందిస్తూ, బాలినేని నియోజకవర్గానికి అప్పుడప్పుడు మాత్రమే వస్తుంటారని, గతంలో టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టించారని, ఇప్పటికీ కూటమి ప్రయోజనాలకు వ్యతిరేకంగా, వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు.

# వేగంగా బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ

**హైదరాబాద్ వాసులకు సులభతరం**

హైదరాబాద్, ఆగస్టు 10 (ఈవార్తలు): జనన, మరణ ధ్రువపత్రాల జారీలో జాప్యాన్ని నివారించి, ఆ ప్రక్రియను మరింత సరళతరం చేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సిద్ధమవుతోంది. నగరవాసుల సౌకర్యార్థం 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్' (సీఆర్ఎస్) పేరుతో సరికొత్త ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేస్తోంది. దీని ద్వారా ప్రజలు ఆన్‌లైన్‌లోనే జనన, మరణాలను సులువుగా నమోదు చేసుకుని, వేగంగా ధ్రువపత్రాలను పొందే వీలుంటుంది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదు, సకాలంలో ధ్రువపత్రాల జారీ అనేది జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. రాబోయే కొత్త పోర్టల్ పనితీరుతో పాటు జనన, మరణాల నమోదు చట్టంపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ నూతన డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల పార్లమెంట్ ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం–2026 నేపథ్యంలో జీహెచ్ఎంసీ తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. నూతన చట్టం ప్రకారం, జనన లేదా మరణాల నమోదులో జాప్యం జరిగితే కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి.

# యాగాలు కాదు.. ప్రాజెక్టులు పూర్తి చేయండి

**తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా కేంద్రాన్ని ప్రశ్నించరేం?.. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం చేస్తే ప్రజలు క్షమించరు: జీవన్‌రెడ్డి**

జగిత్యాల, ఆగస్టు 10 (ఈవార్తలు): వరుణ యాగాలు చేయడం కాదని.. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే పరిణామాలపై గత ఆరు నెలలుగా హెచ్చరిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు వరుణ యాగాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా.. ఆ నీటిని తెలంగాణకు సద్వినియోగం చేసుకునే చర్యలు ప్రభుత్వం చేపట్టడం లేదని ఆరోపించారు. అన్నారం, సుందిళ్ల సీపేజ్ సమస్యలను పరిష్కరించకుండా రెండేళ్లు గడిపారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపడతామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని మూడు బడ్జెట్లు గడిచినా పనులు ప్రారంభించలేదన్నారు. మహారాష్ట్రతో చర్చలు జరపాల్సి ఉంటే 30 నెలలుగా ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. కన్నెపల్లి వద్ద కాపర్ డ్యామ్ నిర్మించి నీటిని ఎత్తిపోస్తే రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరామసాగర్ వరకు నీటిని తరలించే అవకాశం ఉందన్నారు. ఆగస్టు 5న సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కలిసినప్పుడు తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఎందుకు నిలదీయలేదని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. గతంలో ఆమోదం పొందిన ప్రాజెక్టులను పునఃపరిశీలించే అవకాశం లేదని, కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఇప్పటికే అనుమతులు లభించాయని గుర్తు చేశారు. ఫసల్ బీమా యోజనను అమలు



చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ద్వారా రైతు కుటుంబాలకు అండగా నిలిచారని గుర్తు చేశారు. యాగాలు చేయడం మంచిదే.. కానీ మానవ ప్రయత్నం చేయకుండా కేవలం యాగాలపైనే ఆధారపడటం సరికాదని జీవన్‌రెడ్డి అన్నారు. సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు నీరందించాలని, నిర్మాణంలో మరింత జాప్యం చేస్తే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జీనత్ పర్వీన్ మున్నా, కల్లెపెల్లి దుర్గయ్య, సామల రాజశేఖర్, తోట హరీష్, శీలం ప్రవీణ్, రాధాకిషన్ పాల్గొన్నారు.




## కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

**జగిత్యాలలో జైల్‌భరో ఆందోళన.. కార్మిక, రైతు హక్కులను కాపాడాలి: లెల్లల బాలకృష్ణ**

జగిత్యాల, ఆగస్టు 10 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీపీఎం జిల్లా ఇన్‌చార్జి లెల్లల బాలకృష్ణ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తాలో జైల్‌భరో ఆందోళన నిర్వహించారు. నాయకులు రహదారిపై బైఠాయించగా పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని, కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చింత భూమేశ్వర్, ఇందూరి సులోచన, కోమటి శేఖర్, భూతం సారంగపాణి, నాయిని శారద తదితరులు పాల్గొన్నారు.

## 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

జగిత్యాల టౌన్; ఆగస్టు 10 (ఈవార్తలు): వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్, కన్హా ఆశ్రమం, శ్రీరామచంద్ర మిషన్, ఇస్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని క్లబ్ ఆవరణలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్ జనరల్ మేనేజర్ భరద్వాజ్, ఇస్కా ఫౌండేషన్ నిర్వాహకులు మంచాల కృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ ప్రతినిధి టీవీ సూర్యం ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. ఆయుర్వేదం, నేచురోపతి, ఫిజియోథెరపీ తదితర విభాగాల్లో వైద్య నిపుణులు సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించారు. డాక్టర్ నవనీత్, డాక్టర్ నందిని, డాక్టర్ సంగ్రామ్, డాక్టర్ రఘువీర్, డాక్టర్ చంద్రశేఖర్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆయుర్వేదం, నేచురోపతి, ఫిజియోథెరపీ వంటి భారతీయ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు.



## మేడిపల్లి సత్యం డౌన్ డౌన్

**దద్దరిల్లిన నారాయణపూర్.. ముంపు గ్రామంగా ప్రకటించాలని రిలే నిరాహార దీక్ష**

**రెండో రోజుకు చేరిన ఆందోళన.. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సంఘీభావం**

గంగాధర, ఆగస్టు 10 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా గ్రామస్థులు 'మేడిపల్లి సత్యం డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ముంపు గ్రామం కోసం చిన్నా పెద్దా తేడా లేకుండా గ్రామస్థులు ఏకమై పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. అధికార యంత్రాంగం స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. దీక్షకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కొత్త జైపాల్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. దీక్ష శిబిరంలో కూర్చొని గ్రామస్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో నారాయణపూర్‌కు వచ్చిన ఎమ్మెల్యే గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తానని ఆంజనేయ స్వామి సాక్షిగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాదాపు మూడేళ్లు గడిచినా సమస్యకు పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. రెండు, మూడు నెలల సమయం కావాలని చెప్పినా ప్రజలు అర్థం చేసుకునేవారని, అయితే హామీపై స్పష్టత ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ముంపు గ్రామం కోసం ప్రశ్నిస్తున్న ప్రజలను బెదిరించడం, అక్రమ కేసులు పెట్టడం, జైలుకు పంపడం సరికాదని రవిశంకర్ అన్నారు. గ్రామంలో పోలీసులను మోహరించి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సర్వేకు సంబంధించిన అంశంలో అక్కడ లేని వారిపైనా కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులు వారిని ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. నారాయణపూర్‌తో పాటు మంగపేట, చెర్లపల్లి, ఇస్తారిపల్లి గ్రామాల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటపై నిలబడి నాలుగు గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. "ప్రజల కన్నీళ్లు, గోస ఊరికే పోవు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుని నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేయాలి" అని సుంకె రవిశంకర్ అన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.



## రాష్ట్ర యూత్ అథ్లెటిక్స్‌లో ధర్మారం విద్యార్థినికి రజతం

ధర్మారం, ఆగస్టు 10 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ చదువుతున్న తుమ్మల మనోజ్ఞ రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటింది. హనుమకొండ జిల్లా జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో హెప్టాథ్లాన్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో మనోజ్ఞ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, ధర్మారం మండలానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని మనోజ్ఞను వ్యాయామ ఉపాధ్యాయులు బైకనీ కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## వృద్ధులు, బీడీ కార్మికులకూ పింఛన్లు ఇవ్వాలి

కోరుట్ల, ఆగస్టు 10 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 15 నుంచి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభించనున్న నేపథ్యంలో అర్హులైన వృద్ధులు, బీడీ కార్మికులకు చేయూత పింఛన్లలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కోరుట్ల నియోజకవర్గ తెలంగాణ రక్షణ సేన సీనియర్ నాయకుడు అజారుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక ఏళ్లుగా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వయస్సు మీదపడిన బీడీ కార్మికులు పని చేసే పరిస్థితుల్లో లేక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఎంతో ఆసరాగా ఉంటుందని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్ల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొత్త పింఛన్ల ప్రక్రియలో అర్హత ఉన్న వృద్ధులు, బీడీ కార్మికులు ఎలాంటి కారణాలతోనూ నష్టపోకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అజారుద్దీన్ కోరారు.



## వర్షపు నీటి సమస్యకు పరిష్కారం: దుమాల

జగిత్యాల టౌన్, ఆగస్టు 10 (ఈవార్తలు): జగిత్యాల: పట్టణంలోని 16వ వార్డు రహ్మత్‌పుర నాఫిసియా మసీదు వద్ద వర్షపు నీటి నిల్వ సమస్యకు పరిష్కారం కల్పించారు. ఇమామ్ గౌరీ ఇంటి వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన 16వ వార్డు కౌన్సిలర్, డీసీసీ చైర్మన్ (ఎస్సీ డిపార్ట్‌మెంట్) దుమాల రాజ్‌కుమార్ మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ జేసీబీ సహాయంతో పనులు చేపట్టి వర్షపు నీరు సులభంగా వెళ్లేలా పైపులను ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులకు వర్షపు నీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది. 16వ వార్డు అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని కౌన్సిలర్ దుమాల రాజ్‌కుమార్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

## క్రీడాకారులకు ఖిల్లాగా హన్మాజీపేట

**డాక్టర్ చెన్నమనేని దీప వికాస్.. గ్రామంలో ఓపెన్ జిమ్ ప్రారంభం**

వేములవాడ అర్బన్, ఆగస్టు 10 (ఈవార్తలు): గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతిమ ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామంలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని దీప వికాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు నిత్యం వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకునేలా ఓపెన్ జిమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గ్రామంలోని యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. హన్మాజీపేట గ్రామం క్రీడాకారులకు ఖిల్లాగా మారాలని డాక్టర్ దీప వికాస్ ఆకాంక్షించారు. యువత చదువుతో పాటు క్రీడలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడా, వ్యాయామ సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హన్మాజీపేట సర్పంచ్ జంకె మధు, వార్డు సభ్యులు, బీజేపీ మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్, బొల్లారం సర్పంచ్ సండేసారి సౌజన్య మల్లికార్జున్, ధర్మారం సర్పంచ్ మిరియాల్కర్ బాలాజీ, మర్రిపెల్లి సర్పంచ్ ప్రణీత్, రుద్రవరం సర్పంచ్ ఉరడి సునీత



రాజిరెడ్డి, ఫాజుల్‌నగర్ ఉపసర్పంచ్ పోగుల రాకేష్, నమిలిగుండపల్లి ఉపసర్పంచ్ గుంటి వంశీకృష్ణ, అచ్చన్నపేట ఉపసర్పంచ్ దాని తిరుపతి, మున్సిపల్ కౌన్సిలర్ రేగుల శ్రీకాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మార్త సత్తయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల తిరుపతి, ఫోన్సెట్టి రాకేష్, చందుర్తి మండల అధ్యక్షుడు ముకిలె విజేందర్, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్, వేములవాడ మండల అధికార ప్రతినిధి సుంకరి నరేందర్, రూరల్ ప్రధాన కార్యదర్శి తోట శేఖర్, వనపర్తి పరశురాములు, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## భీమన్న సేవలో సింగర్ మంగ్లీ

వేములవాడ అర్బన్, ఆగస్టు 10 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ) సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు, వేద పండితులు మంగ్లీకి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వామి, అమ్మవార్ల శేష వస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని ఆమెకు అందించారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు పేరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.






## 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు

జగిత్యాల టౌన్; ఆగస్టు 10 (ఈవార్తలు): వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్, కన్హా ఆశ్రమం, శ్రీరామచంద్ర మిషన్, ఇస్కా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని క్లబ్ ఆవరణలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్ జనరల్ మేనేజర్ భరద్వాజ్, ఇస్కా ఫౌండేషన్ నిర్వాహకులు మంచాల కృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ ప్రతినిధి టీవీ సూర్యం ఆధ్వర్యంలో శిబిరం కొనసాగింది. ఆయుర్వేదం, నేచురోపతి, ఫిజియోథెరపీ తదితర విభాగాల్లో వైద్య నిపుణులు సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సూచనలు అందించారు. డాక్టర్ నవనీత్, డాక్టర్ నందిని, డాక్టర్ సంగ్రామ్, డాక్టర్ రఘువీర్, డాక్టర్ చంద్రశేఖర్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆయుర్వేదం, నేచురోపతి, ఫిజియోథెరపీ వంటి భారతీయ వైద్య విధానాలు ఆరోగ్య పరిరక్షణలో ఎంతో ఉపయోగకరమన్నారు.

## 1948 రోజులుగా అన్నదానం

**దాతల సహకారంతో కొనసాగుతున్న సేవా కార్యక్రమం**

వేములవాడ అర్బన్, ఆగస్టు 10 (ఈవార్తలు): అన్నం పరబ్రహ్మస్వరూపమని భావిస్తూ మై వేములవాడ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1948 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా సోమవారం అన్నార్తులకు, పేదలకు అన్నదానం నిర్వహించారు. సోమవారం నాటి అన్నదాన కార్యక్రమానికి ఐతు శైనిత పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు, పరకాల వాస్తవ్యులు ఐతు సతీష్, సునీత దంపతులు, కుటుంబ సభ్యులు నేటి అన్నదాతలుగా



వ్యవహరించారు. అలాగే ట్రస్టుకు శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత దంపతులు, ప్రతాప-స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్-జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ-సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ-బాలచందర్‌రాజు దంపతులు, రామడుగు శ్రీలత, ఆమె కుమారులు, కోడళ్లు ప్రజ్ఞ-శరత్చంద్ర దంపతులు, శిరీష-సాయిచంద్ర దంపతులు, శర్వాణి-రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు, చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నట్లు ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. పుట్టినరోజు, పెళ్లిరోజు లేదా ఇతర శుభకార్యాల సందర్భంగా పేదలు, అన్నార్తులకు ఒక్కపూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించాలని కోరారు. ఇందుకోసం 9246939388 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, పసుల శ్రీధర్, ముంజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు

మెట్‌పల్లి, ఆగస్టు 10 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి రాజలక్ష్మి-నరేందర్ దంపతుల ఇంట్లో సోమవారం ఆనందం వెల్లివిరిసింది. డెలివరీ నిమిత్తం మెట్‌పల్లి పట్టణంలోని మిషన్ ఆస్పత్రిలో చేరిన రాజలక్ష్మి ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. వైద్యుల పర్యవేక్షణలో జరిగిన ప్రసవంలో ఒక మగబిడ్డ, ఇద్దరు ఆడపిల్లలు జన్మించినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మగబిడ్డ 1.8 కిలోలు, ఇద్దరు ఆడపిల్లలు ఒక్కొక్కరు 1.5 కిలోల బరువుతో జన్మించారు. ప్రస్తుతం తల్లితో పాటు ముగ్గురు శిశువులు ఆరోగ్యంగా ఉన్నారని, వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించడంతో కుటుంబసభ్యులతో పాటు రాజేశ్వర్‌రావుపేట గ్రామంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి.

## బోనాలకు జ్యోతి లక్ష్మణ్‌కు ఆహ్వానం

జగిత్యాల, ఆగస్టు 10 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌ను తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల బృందం సభ్యులు సోమవారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బృందం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బోనాల జాతర పండుగ కార్యక్రమానికి ఆమెను ప్రత్యేకంగా ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కళాకారుల బృందం సభ్యులు తెలిపారు. జానపద కళలు, సంప్రదాయాలను పరిరక్షిస్తూ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆహ్వానాన్ని స్వీకరించి కళాకారుల బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, కళలు, సంప్రదాయాలను కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆమె అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జగిత్యాల జిల్లా యూట్యూబర్స్, కళాకారుల బృందం సభ్యులు పాల్గొన్నారు.




# ప్రజాస్వామ్యం - న్యాయాధిపతి!

## సీజేఐకి నల్సార్ విద్యార్థుల సెగ.. దుమారం రేపిన 'కాక్రోచ్' వ్యాఖ్యలు.. యువత అసంతృప్తికి కారకుడిగా భావన

(శ్రీశైలం దూడం – ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9133947176)

ఒకప్పుడు విద్యార్థులు న్యాయం కోసం కోర్టు తలుపు తట్టేవారు. ఇప్పుడు అదే న్యాయ విద్యార్థులు దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిని తమ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రావద్దని కోరుతున్నారంటే ఇది సాధారణ పరిణామం కాదు. ఇది ఒక ఆహ్వాన వివాదం మాత్రమే కాదు; న్యాయవ్యవస్థపై యువతకు ఉన్న అభిప్రాయం, ప్రశ్నించే హక్కు, రాజ్యాంగ సంస్థల గౌరవం.. మూడింటినీ ఒకేసారి పరీక్షిస్తున్న సందర్భం. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో 2026 బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించవద్దంటూ వందలాది విద్యార్థులు యాజమాన్యానికి లేఖ రాసినట్లు వార్తలు వచ్చాయి. కొందరు విద్యార్థులు ఒక పూట భోజనం మానేసి నిరసన వ్యక్తం చేసినట్లు కూడా సమాచారం.

*సీజేఐ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా రావడం విశ్వవిద్యాలయ సంప్రదాయంగా ఉన్న నేపథ్యంలో ఈ నిరసన మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అసలు విద్యార్థుల ఆగ్రహానికి కారణం ఏమిటి? ఢిల్లీలో విద్యార్థుల నిరసనలకు సంబంధించిన పరిణామాలపై విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన కొన్ని వ్యాఖ్యలు తమ ఆవేదనను పట్టించుకోనట్లుగా అనిపించాయని విద్యార్థులు భావిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీడియోలు, సాక్ష్యాలను పరిశీలించడానికి సమయం లేదనే భావన కలిగించే వ్యాఖ్యలు యువతలో అసంతృప్తికి కారణవ-ుయ్యాయని తెలుస్తోంది. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన వాస్తవాన్ని కూడా మర్చిపోవద్దు. జూలై 24న సీజేఐ స్వయంగా వివరణ ఇచ్చారు. విద్యార్థుల నిరసనపై పోలీసు చర్యకు సంబంధించిన పిటిషన్‌ను తాను వినడానికి నిరాకరించానన్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అలాంటి పిటిషన్ సుప్రీంకోర్టులో అసలు దాఖలు కాలేదని ఆయన స్పష్టం చేశారు. అంటే విద్యార్థుల ఆవేదనను వినాలి; సీజేఐ వివరణను కూడా వినాలి. అదే సమతుల్యమైన జర్నలిజం.*



ఇక 'కాక్రోచ్' వ్యాఖ్య కూడా ఈ వివాదానికి మరో నేపథ్యం. మేలో ఒక కేసు విచారణ సందర్భంగా కొందరు నిరుద్యోగ యువకులు వృత్తిలో స్థానం దొరకక సోషల్ మీడియా, ఆర్టీఐ, యాక్టివిజంలోకి వెళ్లి వ్యవస్థపై దాడి చేస్తున్నారనే సందర్భంలో సీజేఐ 'కాక్రోచెస్', 'పారాసైట్స్' వంటి పదాలు ఉపయోగించినట్లు వార్తలు వచ్చాయి. ఆ వ్యాఖ్యపై తీవ్ర చర్చ జరిగింది. అయితే తర్వాత సీజేఐ తన వ్యాఖ్యలు దేశ యువతను ఉద్దేశించినవి కాదని, నకిలీ లేదా బోగస్ డిగ్రీలతో వృత్తుల్లోకి ప్రవేశించే వ్యక్తులపై విమర్శగా చెప్పినట్లు వార్తలు పేర్కొన్నాయి. అందువల్ల విద్యార్థుల 'నో'ను వెంటనే తప్పు అని చెప్పడం కూడా సరికాదు; వారు చెప్పిందే పూర్తిగా సరైనదని తేల్చడం కూడా సరికాదు. శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు. కానీ న్యాయ విద్యార్థుల నిరసన కూడా చట్టబద్ధంగా, ఆధారాలతో, వ్యక్తిగత అవమానాలకు తావులేకుండా ఉండాలి. విమర్శ ఉండాలి; అవమానం కాదు. ప్రశ్న ఉండాలి; విద్వేషం కాదు. నిరసన ఉండాలి; విధ్వంసం కాదు. అలాగే ఒక న్యాయమూర్తిని విమర్శించడం అంటే సుప్రీంకోర్టును తిరస్కరించడం కాదు. ఒక వ్యాఖ్యపై అసమ్మతి అంటే రాజ్యాంగాన్ని తిరస్కరించడం కాదు. సుప్రీంకోర్టు ఒక వ్యక్తి కాదు; అది ఒక రాజ్యాంగ సంస్థ. అందువల్ల వ్యక్తిగత వ్యాఖ్యపై వచ్చిన వివాదాన్ని మొత్తం న్యాయవ్యవస్థపై అవిశ్వాసంగా మార్చడం కూడా ప్రమాదకరం. అయితే న్యాయమూర్తుల మాటలకు ప్రత్యేకమైన బరువు ఉంటుంది. నిరుద్యోగం, పరీక్షలపై అనుమానాలు, పేపర్ లీకులు, భవిష్యత్తుపై ఆందోళనలతో ఉన్న యువత ప్రతి మాటను సున్నితంగా స్వీకరిస్తుంది. అందుకే న్యాయమూర్తుల నుంచి మరింత సంయమనం, సందర్భస్పష్టతను ప్రజలు ఆశించడం సహజం. అది న్యాయవ్యవస్థను అవమానించడం కాదు; ఆ పదవికి ఉన్న గౌరవాన్ని మరింత బలోపేతం చేయాలనే ఆకాంక్ష.

నల్సార్ వివాదానికి పరిష్కారం ఎవరు గెలిచారు, ఎవరు ఓడిపోయారు అనే దానిలో లేదు. విశ్వవిద్యాలయ యాజమాన్యం విద్యార్థులతో మాట్లాడాలి. విద్యార్థులు తమ అభ్యంతరాలను ఆధారాలతో వివరించాలి. సీజేఐ వ్యాఖ్యల పూర్తి సందర్భాన్ని, తర్వాత ఇచ్చిన వివరణను కూడా పరిశీలించాలి. సాధ్యమైతే సంభాషణకు వేదిక కల్పించాలి. ఒకవేళ సీజేఐ స్వయంగా విద్యార్థులతో మాట్లాడితే అది బలహీనత కాదు; న్యాయవ్యవస్థ బలం. "మీకు నా మాటలపై అభ్యంతరం ఉంది. మీ ప్రశ్న ఏమిటో చెప్పండి" అనే అవకాశం ఇవ్వడం ద్వారా ఒక ఆహ్వాన వివాదాన్ని ప్రజాస్వామ్య సంభాషణగా మార్చవచ్చు. ఇక్కడ మరో పెద్ద ప్రశ్న కూడా ఉంది. స్నాతకోత్సవం ఒక సాధారణ ప్రభుత్వ కార్యక్రమం కాదు. ఎన్నో సంవత్సరాలు చదివి న్యాయ విద్యను పూర్తి చేసిన విద్యార్థుల జీవితంలో అది గుర్తుండిపోయే రోజు. ఆ రోజుకు ముఖ్య అతిథిగా ఎవరు రావాలన్నది విద్యార్థుల భావోద్వేగాలకు, విశ్వవిద్యాలయ సంప్రదాయానికి, జాతీయ సంస్థల గౌరవానికి సంబంధించిన నిర్ణయం. అందుకే తొందరపడి ఆహ్వానం రద్దు చేయడం లేదా విద్యార్థుల నిరసనను అణచివేయడం రెండూ సరైన మార్గాలు కావు. విద్యార్థులు ఒక వ్యక్తిని ఇష్టపడకపోవచ్చు. ఒక వ్యాఖ్యతో బాధపడవచ్చు. కానీ న్యాయ విద్యార్థులుగా తమ నిరసనకు చట్టపరమైన హద్దులు తెలుసుకోవాలి. అదే సమయంలో విశ్వవిద్యాలయ యాజమాన్యం కూడా "ఇది మా సంప్రదాయం" అంటూ విద్యార్థుల స్వరాన్ని పక్కన పెట్టకూడదు. సంప్రదాయం ప్రజాస్వామ్య సంభాషణకు అడ్డంకి కాకూడదు. ఇంకో విషయం మరింత ముఖ్యమైనది. కోర్టు తీర్పు, న్యాయమూర్తి వ్యాఖ్య, మీడియా కథనం.. ఈ మూడూ ఒకటే కావు. ఒక వ్యాఖ్యను పూర్తి సందర్భంతో చూడకుండా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన భాగం ఆధారంగా నిర్ణయం తీసుకుంటే అపార్థం పెరుగుతుంది. విద్యార్థులు కూడా పూర్తి వాస్తవాలను తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి. మీడియా కూడా సంచలనాన్ని మాత్రమే కాకుండా నిజానిజాలను ముందుకు తేవాలి.


అదే సమయంలో యువతను "అసహనంగా ఉన్న తరం"గా కొట్టిపారేయడం కూడా సరికాదు. ఈ తరం ప్రశ్నిస్తుంది. ఉద్యోగాల గురించి ప్రశ్నిస్తుంది. పరీక్షల గురించి ప్రశ్నిస్తుంది. న్యాయం గురించి ప్రశ్నిస్తుంది. వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ప్రజాస్వామ్య వ్యవస్థల బాధ్యత. ప్రశ్నలు లేకుండా విశ్వాసం ఉండదు; సమాధానాలు లేకుండా విశ్వాసం నిలవదు. కాబట్టి నల్సార్‌లో జరుగుతున్న పరిణామాన్ని ఒక చిన్న క్యాంపస్ వివాదంగా చూడకూడదు. ఇది రేపటి న్యాయవాదులు, న్యాయమూర్తులు, రాజ్యాంగ నిపుణులు తయారవుతున్న తరగతి గదుల నుంచి వస్తున్న సంకేతం. వారు న్యాయాన్ని పుస్తకాల్లో మాత్రమే కాకుండా జీవనంలో చూడాలనుకుంటున్నారు. వారి ఆవేదనలో తప్పులు ఉంటే వాటిని చర్చ ద్వారా సరిచేయాలి; వారి ప్రశ్నల్లో నిజం ఉంటే దాన్ని గౌరవంగా స్వీకరించాలి. అదే న్యాయ సంస్కృతికి, రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి నిజమైన పరీక్ష కూడా. చివరికి గెలవాల్సింది సీజేఐ కాదు, విద్యార్థులు కాదు, విశ్వవిద్యాలయం కాదు.. న్యాయం. విద్యార్థులకు ప్రశ్నించే హక్కు ఉండాలి. న్యాయవ్యవస్థకు గౌరవం ఉండాలి. న్యాయమూర్తులకు సంయమనం ఉండాలి. విశ్వవిద్యాలయాలకు సంభాషణ ఉండాలి. నల్సార్‌లో వినిపిస్తున్న స్వరం సుప్రీంకోర్టుకు వ్యతిరేకమైనదిగా కాకుండా, న్యాయవ్యవస్థ మరింత దగ్గరగా వినాల్సిన యువత స్వరంగా మారితే ఈ వివాదం విభేదంగా ముగియదు. అది ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచే ప్రజాస్వామ్య పాఠంగా నిలుస్తుంది.






## వయ్యారి చిత్రం


పాయల్ రాజ్‌పుత్



# హన్సిక ‘మిస్టరీ లుక్’

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం ‘కపాలి’. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో ‘కపాలి’ కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.

# ముందు కాల్చి, తర్వాతే మాట్లాడతాం: టబు



స్టార్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్, ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో వస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘స్లమ్‌డాగ్ - 33 టెంపుల్ రోడ్’. ఈ సినిమాపై మొదటి నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి, కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ నటి టబు క్యారెక్టర్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఈ సినిమాలో టబు ‘గౌరీ హెగ్డే’ అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. గ్లింప్స్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. “భయంలేని, శక్తివంతమైన, ధైర్యవంతురాలు. భారతీయ సినిమా రత్నం టబును గౌరీ హెగ్డేగా పరిచయం చేస్తున్నాం” అని పూరి జగన్నాథ్ పేర్కొన్నారు. విడుదలైన వీడియోలో టబు తన పాత్రలో ఒదిగిపోయారు. కొందరిని కొడుతూ, బెదిరిస్తూ పవర్‌ఫుల్ ఆఫీసర్‌గా కనిపించారు. “మా స్టైల్‌లో మేము ముందు కాల్చి, ఆ తర్వాత మాట్లాడతాం” అంటూ విజయ్ సేతుపతికి ఆమె చెప్పే డైలాగ్ గ్లింప్స్‌కే హైలైట్‌గా నిలిచింది. చివర్లో “గౌరీ హెగ్డే - డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్” అని ఆమె తన హోదాను వెల్లడించడం ఆకట్టుకుంది. గతేడాది జులైలో ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని చిత్ర వర్గాలు తెలిపాయి. గతంలో విడుదల చేసిన టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి చేతిలో కత్తి, చుట్టూ డబ్బు కట్టలతో కనిపించి సినిమాపై క్యూరియాసిటీ పెంచారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్.. జేబీ మోషన్ పిక్చర్స్‌తో కలిసి జేబీ నారాయణరావు కొండ్రొళ్ల నిర్మిస్తున్నారు.

# ఏఆర్ రెహమాన్ కుమారుడికి ప్రమాదం



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ కుమారుడు ఏఆర్ అమీన్ ఈరోజు తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెన్నైలోని ఒలింపియా టెక్ పార్క్ సమీపంలో ఆయన ప్రయాణిస్తున్న లగ్జరీ కారు, ఒక క్యాబ్‌ను ఢీకొనడంతో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో అమీన్ తన స్నేహితుడితో కలిసి జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులో గిండి వైపు ప్రయాణిస్తున్నారు. వారి వాహనం ఒలింపియా టెక్ పార్క్ వద్దకు రాగానే, ఓ పక్క రోడ్డు నుంచి క్యాబ్ ఒక్కసారిగా ప్రధాన రహదారిపైకి వచ్చింది. దీంతో అమీన్ ప్రయాణిస్తున్న కారు, క్యాబ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమీన్, అతని స్నేహితుడితో పాటు క్యాబ్‌లో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం చికిత్స అందించి, అందరినీ డిశ్చార్జ్ చేశారు. ఎవరికీ తీవ్రమైన గాయాలు కాలేదని పోలీసులు స్పష్టం చేశారు. అయితే, ప్రమాదంలో రెండు వాహనాలు దెబ్బతిన్నాయి.

# మెగాస్టార్ సినిమాలో మీనాక్షి?




మెగాస్టార్ చిరంజీవి - బాబీ కొల్లి కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతుంది. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా అప్ డేట్ కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐతే, ఈ సినిమాలో మీనాక్షి చౌదరి ఓ పాత్రలో కనిపిస్తోందట. ఐతే, ఆమెది హీరోయిన్ పాత్ర కాదు అని, ఓ గెస్ట్ రోల్ లో మీనాక్షి చౌదరి నటిస్తోందని తెలుస్తోంది. ఇక ఈ సినిమా సెకండ్ హాఫ్ లో వచ్చే ఫ్లాష్ బ్యాక్ కోసం మెగాస్టార్ చిరంజీవి సరికొత్త లుక్ లో కనిపించబోతున్నాడు. అన్నట్టు ఈ ఫ్లాష్ బ్యాక్ లో మెగాస్టార్ పాత్ర మాఫియా నేపథ్యంలో ఉంటుందట. పైగా ఈ సినిమాలో మెగాస్టార్ పాత్రల్లో చాలా వేరియేషన్స్ ఉంటాయట. అలాగే, ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. చిరును కొత్తగా చూపించాలనే ఉద్దేశ్యంతో ఈ కథ రాసుకున్నారట బాబీ. కాగా ఈ సినిమాని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మాతలు వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. కాగా గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన వాల్తేరు వీరయ్య మంచి విజయం సాధించింది.

# ప్రమోషన్స్ చేయడం రాదు




దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార, తన సినిమాల ప్రమోషన్లకు దూరంగా ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలకు ఆమె హాజరుకావడం చాలా అరుదు. అయితే, తన ఈ నియమాన్ని పక్కనపెట్టి, నిన్న జరిగిన ‘టాక్సిక్’ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఆమె హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను ఎందుకు వచ్చానో కూడా ఈ వేదికపై ఆమె స్వయంగా వెల్లడించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. “నేను ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరుకాకూడదని కాదు. నాకు ఆ పని సరిగ్గా చేతకాదు. అందుకే వాటికి దూరంగా ఉంటాను. కానీ, ఈ కార్యక్రమానికి రావడానికి హీరో యశ్ ఒక్కరే కారణం. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేశారు, ఈ ఈవెంట్‌కు రావడానికి నాకు అది చాలు” అని తెలిపారు. కేవలం యశ్ కోసమే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని స్పష్టం చేశారు. యశ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. “చాలా మంది పెద్ద స్టార్స్ ఉంటారు. కానీ, యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు, తెరపై ఆయనకున్న లార్జర్-దెన్-లైఫ్ ఇమేజ్ నిజ జీవితంలో కూడా కనిపించింది. ఆయన వ్యక్తిత్వం కూడా అంతే గొప్పది” అని ప్రశంసించారు.

# ‘వారణాసి’లో హనుమంతుడిగా రామ్‌చరణ్?



దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం ‘వారణాసి’. ‘ఆర్‌ఆర్‌ఆర్’తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. హనుమంతుడి పాత్రలో రామ్ చరణ్ నటించనున్నట్లు తెలుస్తోంది.

# ‘ఇంద్రపుత్ర’గా కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం ‘చెన్నై లవ్ స్టోరీ’ విజయానందంలో ఉన్నారు. ఐతే, తన కెరీర్ లోనే భారీ బడ్జెట్‌తో రూపొందే ఓ పౌరాణిక చిత్రం కోసం ఆయన ప్రేరణ అరోరా మరియు జీ స్టూడియోస్‌తో జతకట్టారన్న విషయం తెలిసిందే. ఐతే, ఈ చిత్రానికి ‘ఇంద్రపుత్ర’ అని పేరు పెట్టినట్లు చిత్ర బృందం తాజాగా అధికారికంగా ప్రకటించింది. ‘కాంతార: చాప్టర్ 1’ చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీకాంత్ పుప్పాల ఈ పాన్-ఇండియా చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. కీర్తన్ సహ-నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం, నిర్మాతలు ప్లాన్ చేస్తున్న పౌరాణిక ప్రపంచంలో మొదటి భాగం కానుంది. ఇక ఈ సినిమాకి సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణులు మరియు ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు రాబోయే రోజుల్లో వెల్లడి కానున్నాయి.



# స్నేహంగా ఉండే భాగస్వామితోనే పెళ్లి

**: సారా టెండుల్కర్**

టీమిండియా దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ కుమార్తె సారా టెండుల్కర్ వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను కోరుకున్న లక్షణాలు ఉన్న వ్యక్తి తారసపడేంత వరకు పెళ్లి చేసుకోనని స్పష్టం చేసింది. తన తల్లిదండ్రుల మధ్య బలమైన స్నేహ బంధం ఉందని.. అదే వారి అన్యోన్య దాంపత్యానికి పునాది అని పేర్కొంది. కాగా సచిన్ టెండుల్కర్ కెరీర్ తొలి నాళ్లలోనే డాక్టర్ అంజలితో ప్రేమలో పడ్డాడు. క్రికెటర్‌గా నిలదొక్కుకున్న తర్వాత ఇరుకుటుంబాలను ఒప్పించి ఆమెను పెళ్లి చేసుకున్నాడు. వయసులో సచిన్ కంటే అంజలి ఆరేళ్లు పెద్ద. అయితే, ఇదేమీ వారి ప్రేమకు అడ్డంకి కాలేదు. ముప్పై ఏళ్లకు పైగా వివాహ బంధంలో కొనసాగుతున్న సచిన్- అంజలి నేటికీ ఎంతో అన్యోన్యంగా ఉంటూ.. కపుల్ గోల్స్ సెట్ చేస్తున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా తొలుత కుమార్తె సారా.. ఆ తర్వాత అర్జున్ జన్మించారు. సారా న్యూట్రీషనిస్ట్. అదే విధంగా మెడల్, కంటెంట్ క్రియేటర్‌గా కొనసాగుతూ.. వెల్‌నెస్ బిజినెస్‌లోనూ అడుగుపెట్టింది. మరోవైపు.. అర్జున్ క్రికెటర్‌గా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. అయితే, అక్క సారా కంటే ముందే అర్జున్ పెళ్లి పీటలెక్కాడు. ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెప్పిన సానియా చందోక్‌తో ఈ ఏడాది పెళ్లి బంధంలో అడుగుపెట్టాడు. అయితే, 28 ఏళ్ల సారా ఇప్పటికీ సింగిల్‌గానే ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా వోగ్ ఇండియాతో మాట్లాడిన సారా టెండుల్కర్ తన కాబోయే భర్త ఎలా ఉండాలన్న అంశంపై స్పందించింది. "నా తల్లిదండ్రులు భార్యాభర్తలు అవడానికంటే ముందు మంచి స్నేహితులు. ఇంట్లో వాళ్లిద్దరి సరదాగా గొడవపడుతూ ఉంటారు. వారిద్దరిని చూస్తే ముచ్చటేస్తుంది. వారి బంధం అత్యద్భుతంగా అనిపిస్తుంది. నాకు కూడా అలా స్నేహంగా ఉండే భాగస్వామి రావాలని కోరుకుంటున్నా. నా ప్రాణ స్నేహితులంతా నా సోల్‌మేట్స్ అనే చెప్తాను. అయితే, నా పార్ట్‌నర్‌ను రొమాంటిక్ సోల్‌మేట్‌గా చూస్తాను" అని సారా పేర్కొంది.

# అవకాశం వస్తే వదులుకుంటానా?: భువీ

టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ తన అంతర్జాతీయ క్రికెట్ రీఎంట్రీపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్-2027 కోసం సెలక్టర్ల నుంచి పిలుపు వస్తే, తిరిగి జాతీయ జట్టు తరపున ఆడేందుకు సిద్ధంగా ఉన్నానని భువీ తెలిపాడు. కాగా 36 ఏళ్ల భువనేశ్వర్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండు టైటిల్స్‌ను సొంతం చేసుకోవడంలో ఈ యూపీ పేసర్‌ది కీలక పాత్ర. ఈ ఏడాది సీజన్‌లో 16 మ్యాచ్‌లు ఆడి 28 వికెట్లతో భువీ సత్తాచాటాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలన్న డిమాండ్లు ఎక్కువయ్యాయి. రవిచంద్రన్ అశ్విన్, రవి శాస్త్రి, దినేష్ కార్తీక్ వంటి దిగ్గజ క్రికెటర్లు సైతం భువీని ఎంపిక చేయాలని సెలక్టర్లకు సూచించారు. ఈ క్రమంలోనే భువనేశ్వర్ కుమార్ కూడా రీఎంట్రీ ఇచ్చేందుకు తను రెడీగా ఉన్నానని చెప్పుకొచ్చాడు. "జాతీయ జట్టు సెలెక్టర్ల నుంచి పిలుపు వస్తే నేను ఎందుకు కాదంటాను? భారత్ తరపున ఆడేందుకు నేను ఎల్లప్పుడూ సిద్ధమే. కానీ నా చేతుల్లో లేని విషయం గురుంచి ఎక్కువ నేను ఆలోచించను. నన్ను తీసుకోవాలా లేదా అన్నది సెలక్టర్ల నిర్ణయంపై ఆధారపడి ఉటుంది. అయితే నా శరీరం అలిసిపోయేంతవరకు క్రికెట్ ఆడుతూనే ఉంటాను. అందుకే యూపీ టీ20 లీగ్ ఆడేందుకు ఇక్కడికి వచ్చాను. అంతేతప్ప మెరుగ్గా రాణించి ఎవరినో ఆకట్టుకోవాలని అయితే ఇక్కడికి రాలేదు. ఐపీఎల్‌లో కూడా అంతే. జట్టు కోసం రాణించి మ్యాచ్‌లు గెలవాలన్నదే నా లక్ష్యం.





# సర్ఫరాజ్ రీఎంట్రీ

## శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ఎంపిక.. సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి

### నెం.3 స్థానం కోసం పడిక్కల్, గిల్ పోటీ

శ్రీలంక పర్యటనకు ముందు భారత టెస్ట్ జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ ఆటగాడు బి. సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్‌కు దూరమవడంతో అతని స్థానంలో మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది.

**2024లోనే టెస్టుల్లో అరంగేట్రం చేసిన సర్ఫరాజ్, పరిమిత అవకాశాల్లో రాణించినప్పటికీ జట్టులో స్థానం సుస్థిరం చేసుకోలేకపోయాడు. ఇప్పుడు అనూహ్యంగా లభించిన ఈ అవకాశంతో అతను మళ్లీ జట్టులోకి వచ్చాడు. అయితే, సర్ఫరాజ్ పునరాగమనం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు జట్టు ఎంపిక విషయంలో కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది.**

వాస్తవానికి గాయపడిన సాయి సుదర్శన్‌ను నెం.3 స్థానంలో ఆడించాలని గంభీర్ భావించాడు. ఇప్పుడు అతని స్థానంలో వచ్చిన సర్ఫరాజ్‌కు ఆ బాధ్యతలు అప్పగించే అవకాశాలు చాలా తక్కువ. ఎందుకంటే.. సర్ఫరాజ్ ఎక్కువగా మిడిలార్డర్‌లో (నెం.5 లేదా నెం.6) బ్యాటింగ్ చేసేవాడు. దీంతో ఖాళీ అయిన నెం.3 స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ప్రమోట్ చేయడం లేదా యువ ఆటగాడు దేవదత్ పడిక్కల్‌కు అవకాశం ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలను గంభీర్ పరిశీలిస్తున్నాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌లో పడిక్కల్ అద్భుతమైన సెంచరీతో ఆకట్టుకోవడం అతని అవకాశాలను మరింత మెరుగుపరిచిందనే చెప్పాలి. శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ నెం.3 స్థానంలో బ్యాటింగ్ చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో రిషబ్ పంత్‌ను ఆ స్థానంలో పరీక్షించారు. మరోవైపు సర్ఫరాజ్ తన కెరీర్‌లో ఆడిన ఆరు టెస్టుల్లో ఎక్కువగా నెం.5, నెం.6 స్థానాల్లోనే బరిలోకి దిగాడు. అప్పుడప్పుడు నెం.4లో కూడా ఆడాడు. న్యూజిలాండ్‌పై తన ఏకైక టెస్ట్ సెంచరీని నెం.4 స్థానంలోనే నమోదు చేశాడు. ఈ నేపథ్యంలో అతన్ని మళ్లీ మిడిలార్డర్‌లోనే పరిగణించే అవకాశం ఉంది. గాలే వేదికగా జరగనున్న తొలి టెస్టులో భారత తుది జట్టు కూర్పు ఆసక్తికరంగా ఉండనుంది. ఓపెనర్లుగా కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. పడిక్కల్ నెం.3లో, కెప్టెన్ గిల్ నెం.4లో ఆడే అవకాశం ఉంది. వికెట్ కీపింగ్ బాధ్యతలతో పాటు నెం.5 స్థానాన్ని పంత్ లేదా ధ్రువ్ జురెల్ భర్తీ చేయనున్నారు. నెం.6లో స్పిన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా, నెం.7లో మరో ఆల్‌రౌండర్‌గా సరాన్ష్ జైన్‌కు అవకాశం దక్కవచ్చు. ఇప్పటికే జడేజా, కుల్దీప్ రూపంలో ఇద్దరు లెఫ్టార్మ్ స్పిన్నర్లు ఉండటంతో కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్నర్ అయిన సరాన్ష్ జైన్ వైపే యాజమాన్యం మొగ్గు చూపే సూచనలున్నాయి.



# షమీ ఆటపైనే దృష్టి పెట్టు

టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి మరోసారి నిరాశ ఎదురైంది. గాయాల కారణంగా పలువురు ఆటగాళ్లు జట్టుకు దూరమవుతున్నా.. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాలు మొదలైనప్పటికీ.. షమీ పేరు సెలెక్షన్ చర్చల్లో కనిపించడం లేదు. ఈ పరిస్థితిపై భారత మాజీ పేసర్ జహీర్ ఖాన్ స్పందించాడు. జట్టులోకి రావాలనుకుంటే షమీ తన చేతిలో ఉన్న పనిపైనే దృష్టి పెట్టాలని సూచించాడు. "ముందుకు ఎలా వెళ్లాలనేది షమీ నిర్ణయమే. మ్యాచ్‌లు ఆడుతూ బాగా రాణిస్తే జాతీయ జట్టుకు అందుబాటులో ఉన్నట్టే. ప్రస్తుతం జట్టు ఆలోచన మరోలా ఉండొచ్చు. కానీ ఆటగాడిగా మన ఆలోచన, మనం జట్టుకు ఎలా ఉపయోగపడగలమన్నది ముఖ్యం. షమీ ఇప్పుడు చేస్తున్నదే కొనసాగించాలి. మ్యాచ్‌లు ఆడటం, రాణించడం చాలా ముఖ్యం" అని జహీర్ చెప్పాడు. టీమిండియాలో పెరుగుతున్న గాయాలపైనా జహీర్ స్పందించాడు. జస్‌ప్రీత్ బుమ్రా వరుస సిరీస్‌లకు ఫిట్‌గా ఉండలేకపోతుండగా.. వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్య వంటి ఆటగాళ్లు కూడా గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. అయితే గాయాలు ఆటలో భాగమేనని జహీర్ అన్నాడు. ఆటగాళ్ల పని భారం తగ్గించడం అవసరమే అయినా.. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించాడు. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్ గాయపడినప్పుడు తన చేతిలో ఉన్న విషయాలపై నియంత్రణ సాధించడం చాలా ముఖ్యమని చెప్పాడు. గాయానికి అసలు కారణం ఏంటో తెలుసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించాడు.

# ఐదేళ్లకే ప్రపంచ చాంపియన్

భారతదేశం నుంచి అత్యున్నత స్థాయి మార్షల్ ఆర్ట్స్ కళాకారులు అరుదుగా వస్తుంటారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి మారుతున్నట్లు కనిపిస్తోంది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చెందిన ఐదేళ్ల ఫతే సింగ్ గిల్, దేశంలోనే అత్యంత పిన్న వయస్కుడైన ఎంఎంఏ ప్రాడిజీగా రికార్డులు సృష్టిస్తున్నాడు. ఇటీవల థాయ్‌లాండ్‌లోని పట్టాయాలో జరిగిన వరల్డ్ మార్షల్ ఆర్ట్ గేమ్స్ 2026లో స్కేట్స్‌పై గట్కా ప్రదర్శించి స్వర్ణ పతకం సాధించాడు. సిక్కుల సాంప్రదాయ యుద్ధ కళ అయిన గట్కాను స్కేట్స్‌పై ప్రదర్శించిన మొట్టమొదటి చిన్నారిగా ఫతే చరిత్ర సృష్టించాడు. సాధారణంగా చిన్న పిల్లలు క్రికెట్ బ్యాట్ పట్టుకోవడం నేర్చుకునే వయసులో, ఫతే మార్షల్ ఆర్ట్స్‌లో అద్భుతాలు చేస్తున్నాడు. అతని ప్రయాణం కేవలం రెండేళ్ల వయసులోనే ప్రారంభమైంది. అతని చేతి కదలికల్లోని ప్రత్యేకతను తల్లిదండ్రులు గమనించి, ఆ దిశగా ప్రోత్సహించారు. ఫతే తండ్రి రమణ్‌దీప్ కూడా ఒక అథ్లెట్. యూరప్‌లో బాడీబిల్డింగ్ పోటీలలో పాల్గొన్నారు. తన కొడుకు కూడా క్రీడల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. రెండేళ్ల వయసులోనే ఫతే మణికట్టు కదలికలు గట్కాకు సరిగ్గా సరిపోతాయని గుర్తించి, ప్రత్యేకంగా ఓ కిర్పాన్ (సిక్కులు ధరించే కత్తి) తయారు చేయించి శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. 'టైమ్స్ ఆఫ్ ఇండియా'తో ఫతే తల్లి నవప్రీత్ కౌర్ మాట్లాడుతూ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఫతే కడుపులో ఉన్నప్పుడు మంచి పనులు చేయాలని మా అమ్మ చెప్పేవారు. అది బిడ్డ భవిష్యత్తుకు మేలు చేస్తుందని అనేవారు" అని ఆమె గుర్తుచేసుకున్నారు. సోషల్ మీడియాలో ఫతే వీడియోలు చూసిన యూరోపియన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ అధికారి ఒకరు అతడిని ఆహ్వానించడంతో అంతర్జాతీయ ప్రయాణం మొదలైంది.



# 17 కిలోలు తగ్గిన సర్ఫరాజ్

టీమిండియాలో చోటు దక్కించుకోవాలంటే ప్రతిభ ఉంటే సరిపోదు. అవకాశాలు వచ్చినప్పుడు సత్తా చూపాలి. అదే సమయంలో ఫిట్‌నెస్, ఆటలో మెరుగుదలతో సెలెక్టర్ల నమ్మకాన్ని గెలవాలి. గత ఏడాదిన్నరగా సర్ఫరాజ్ ఖాన్ అదే పనిలో ఉన్నాడు. ఏకంగా 17 కిలోల బరువు తగ్గాడు. కశ్మీర్‌కు వెళ్లి ప్రత్యేకంగా సాధన చేశాడు. స్పిన్‌ను ఎదుర్కొనేందుకు గంటల తరబడి బ్యాటింగ్ చేశాడు. ఫలితంగా రెండేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి తిరిగొచ్చాడు. సాయిసుదర్శన్ గాయపడటంతో సర్ఫరాజ్‌కు మరో అవకాశం తలుపుతట్టింది. ఆగస్టు 15 నుంచి శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు అతడిని ఎంపిక చేశారు. న్యూజిలాండ్‌తో 2024లో జరిగిన సిరీస్‌లో వరుసగా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో విఫలమైన తర్వాత సర్ఫరాజ్ జట్టుకు దూరమయ్యాడు. అవకాశం కోసం ఎదురుచూస్తూనే తన లోపాలపై దృష్టి పెట్టాడు సర్ఫరాజ్. గత ఏడాదిన్నరలో 17 కిలోలు తగ్గాడు. ముంబయిలో వర్షాల కారణంగా సాధనకు ఇబ్బంది రావడంతో కశ్మీర్‌లోని షేర్-ఏ-కశ్మీర్ స్టేడియంలో గంటల తరబడి బ్యాటింగ్ సాధన చేశాడు. నెట్ బౌలర్లతో పాటు కశ్మీర్ ఆటగాళ్ల బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. ముంబయిలోనూ సాధన ఆపలేదు. బీకేసీలోని ఎంసీఏ ఇండోర్ కేంద్రంలో ఆస్ట్రో టర్ఫ్‌పై బ్యాటింగ్ చేశాడు. కుర్లాలోని ప్రైవేట్ మైదానాల్లో ఎర్ర మట్టితో కూడిన పిచ్‌లపై సాధన చేశాడు. ముఖ్యంగా స్పిన్‌ను ఎదుర్కొనేందుకు తన ఆటను పదును పెట్టుకున్నాడు. ప్రస్తుతం భారత జట్టులో స్పిన్‌ను బాగా ఆడే బ్యాటర్లలో సర్ఫరాజ్ ఒకడిగా భావిస్తున్నారు. సాధారణ స్వీప్‌తో పాటు రివర్స్ స్వీప్‌ను సమర్థంగా ఆడగలడు. శ్రీలంక పిచ్‌లపై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఈ నైపుణ్యం అతడికి ఉపయోగపడే అవకాశం ఉంది. ఇటీవల ఇంగ్లాండ్ లయన్స్‌పై భారత్-ఏ తరపున 92 పరుగులు చేశాడు. బెక్హామ్‌లో జరిగిన ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లోనూ సెంచరీ సాధించాడు. ఇప్పుడు జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్‌కు తనను తాను నిరూపించుకునే మరో పెద్ద అవకాశం దక్కింది.



ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
మంగళవారం 11-8-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# తరం మారింది.. ఆలోచన సరైనదేనా?

ప్రపంచం వేగంగా మారుతోంది. ఆ మార్పుకు వేగం పెంచుతున్న శక్తుల్లో జెన్ జీ యువత ముందుంది. సాంకేతికతను అరచేతిలో పెట్టుకుని పెరిగిన తరం ఇది. సమాచారం కోసం పుస్తకాలకే పరిమితం కాని తరం. ప్రశ్నించడానికి భయపడని తరం. తమ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పే తరం. నచ్చనిదాన్ని తిరస్కరించే ధైర్యం ఉన్న తరం. ఉద్యోగం, రాజకీయాలు, సంబంధాలు, జీవనశైలి.. దాదాపు ప్రతి అంశంలోనూ పాత మూసలను సవాలు చేస్తున్న తరం. ఈ దూకుడు చాలాసార్లు అద్భుతమైన మార్పులకు కారణమవుతోంది. కానీ అదే దూకుడు ఆలోచన కంటే ముందు నిర్ణయంగా మారితే? అనుభవం కంటే భావోద్వేగం పైచేయి సాధిస్తే? సామాజిక మాధ్యమాల్లో కనిపించినదే నిజమని నమ్మితే? క్షణిక ఆవేశం జీవితకాల నిర్ణయంగా మారితే? అప్పుడు ప్రశ్న తప్పదు.. జెన్ జీ అడుగులు ఎటువైపు? ప్రశ్నించే తరం.. కానీ ఏం ప్రశ్నిస్తోంది? జెన్ జీ ప్రత్యేకత ప్రశ్నించడం. తల్లిదండ్రులను ప్రశ్నిస్తుంది. ఉపాధ్యాయులను ప్రశ్నిస్తుంది. రాజకీయ నాయకులను ప్రశ్నిస్తుంది. సంస్థలను ప్రశ్నిస్తుంది. సమాజంలోని ఆచారాలను ప్రశ్నిస్తుంది. ఇది చెడు కాదు. నిజానికి ప్రశ్నించని యువత ఉన్న సమాజమే ప్రమాదకరం. ప్రశ్నల నుంచే సంస్కరణలు పుడతాయి. ప్రశ్నల నుంచే శాస్త్రం ముందుకు సాగుతుంది. ప్రశ్నల నుంచే ప్రజాస్వామ్యం బలపడుతుంది. కానీ ప్రతి ప్రశ్నకు సమాధానం వెతకాలి. ప్రతి సమాధానాన్ని పరిశీలించాలి. సోషల్ మీడియాలో వైరల్ అయిన అభిప్రాయం నిజం కాదు. ఎక్కువ మంది చెబుతున్నారనే కారణంతో అది సరైనది కాదు. నేటి యువత ముందున్న అతిపెద్ద సవాలు ఇదే.. సమాచారం కొరత కాదు.. సరైన సమాచారాన్ని గుర్తించే సామర్థ్యం. ఒక వీడియో చూశారు. ఒక పోస్ట్ చదివారు. ఒక ఇన్‌ఫ్లుయెన్సర్ చెప్పాడు. వెంటనే అభిప్రాయం ఏర్పడుతోంది. కొన్ని సందర్భాల్లో ఆ అభిప్రాయం ఆధారంగానే రాజకీయ నిర్ణయాలు, వ్యక్తిగత నిర్ణయాలు, సామాజిక స్పందనలు కూడా వస్తున్నాయి. కానీ వైరల్ కంటెంట్‌కు, వాస్తవానికి మధ్య చాలా దూరం ఉండవచ్చు. యువతలో వేగం సహజం. వయసులో ఉత్సాహం ఉంటుంది. కొత్తదాన్ని ప్రయత్నించాలనే తపన ఉంటుంది. ఓటమిని భయపడని ధైర్యం ఉంటుంది. అదే సమయంలో అనుభవం తక్కువగా ఉండొచ్చు. పరిణామాలను పూర్తిగా అంచనా వేసే సామర్థ్యం ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉండొచ్చు. అందుకే పెద్దలు చెప్పే ప్రతి మాటను తిరస్కరించడం ఎంత తప్పో, పెద్దలు చెప్పిన ప్రతిదాన్ని అంగీకరించడం కూడా అంతే తప్పు. జెన్ జీకి కావాల్సింది పెద్దల నియంత్రణ కాదు.. పెద్దల అనుభవం, యువత ఆలోచన కలిసే సంభాషణ. ఒక యువకుడు రాజకీయంగా చురుకుగా ఉండాలి. కానీ ఒక నాయకుడి మాటలను అంధంగా నమ్మకూడదు. ఒక యువతి తన జీవితంపై స్వయంగా నిర్ణయం తీసుకోవాలి. కానీ ఆ నిర్ణయాల దీర్ఘకాలిక ప్రభావాలను కూడా ఆలోచించాలి. ఉద్యోగాన్ని వదిలి స్టార్టప్ ప్రారంభించాలనుకోవచ్చు. కానీ ఆర్థిక ప్రణాళిక ఉండాలి. విదేశాలకు వెళ్లాలనుకోవచ్చు. కానీ అప్పులు, కుటుంబ బాధ్యతలు, భవిష్యత్ అవకాశాలను అంచనా వేయాలి. స్వేచ్ఛ అంటే ఏది కావాలంటే అది చేయడం కాదు. ఏ నిర్ణయం తీసుకున్నా దాని ఫలితాలను భరించే బాధ్యతను స్వీకరించడం.

# చరిత్రలో నిలిచే ఆలోచన



చరిత్రను తిరగేస్తే ఒక ఆసక్తికరమైన సత్యం మన కళ్లముందు నిలుస్తుంది. ఒకప్పుడు అపారమైన సంపదను కూడబెట్టిన రాజులు, సామంతులు, వ్యాపారులు, అధికారుల పేర్లు ప్రపంచాన్ని శాసించినట్లుగా కనిపించాయి. వారి రాజభవనాలు వైభవానికి ప్రతీకలుగా నిలిచాయి. వారి ఖజానాల్లో బంగారం పేరుకుపోయింది. వారి ఆజ్ఞలకు సామ్రాజ్యాలు కదిలాయి. కానీ శతాబ్దాలు గడిచిన తరువాత వారి సంపద ఎక్కడికి వెళ్లిందో, అధికారాన్ని ఎవరు స్వాధీనం చేసుకున్నారో, వారి వారసత్వం ఎలా మారిపోయిందో చరిత్ర చెబుతోంది. అదే సమయంలో ప్రజల ఆలోచనలను మార్చిన తత్వవేత్తలు, సమాజాన్ని సంస్కరించినవారు, జ్ఞానాన్ని విస్తరించిన శాస్త్రవేత్తలు, మానవత్వాన్ని కీర్తించిన రచయితలు, హక్కుల కోసం పోరాడిన నాయకులు మాత్రం కాలాన్ని దాటి నిలిచిపోయారు.

"ఇదే చరిత్ర చెప్పే గొప్ప పాఠం. డబ్బు మనిషి జీవితాన్ని సౌకర్యవంతం చేయవచ్చు. అధికారం అతనికి పదవిని ఇవ్వవచ్చు. కానీ ఆలోచన మాత్రమే అతనికి చరిత్రలో స్థానం కల్పిస్తుంది."

*15వ శతాబ్దం నుంచి మానవ నాగరికతను పరిశీలిస్తే ఈ సత్యం మరింత స్పష్టమవుతుంది. యూరప్‌లో పునరుజ్జీవనోద్యమం వేగం పుంజుకున్న కాలం అది. కళలు, సాహిత్యం, విజ్ఞానం, మానవతావాదం కొత్త దిశలో ప్రయాణించాయి. ముద్రణా యంత్రం విస్తరించడంతో జ్ఞానం కొద్దిమంది చేతుల్లోనే ఉండకుండా ప్రజల్లోకి వెళ్లింది. పుస్తకాలు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. ఆలోచనలు వేగంగా ప్రయాణించాయి. జ్ఞానం కేవలం వ్యక్తిగత సంపద కాకుండా సామాజిక శక్తిగా మారింది. 16వ శతాబ్దంలో మత సంస్కరణలు, శాస్త్రీయ పరిశీలనలు, భౌగోళిక అన్వేషణలు ప్రపంచ దృక్పథాన్ని మార్చాయి. రాజ్యాధికారం, సంపద ఆ కాలంలో కీలకమైనవే అయినప్పటికీ, శతాబ్దాల తరువాత మానవ సమాజం ఎక్కువగా గుర్తుచేసుకునేది ఆలోచనను మార్చిన వ్యక్తులనే. 17వ శతాబ్దంలో శాస్త్రీయ విప్లవం మరొక కీలక మలుపు తీసుకొచ్చింది. ప్రకృతిని మూఢనమ్మకాలతో కాకుండా పరిశీలన, ప్రయోగం, తర్కంతో అర్థం చేసుకోవాలనే భావన బలపడింది.*

శాస్త్రవేత్తల ఆలోచనలు మానవ నాగరికతకు శాశ్వతమైన సంపదగా మారాయి. 18వ శతాబ్దంలో స్వేచ్ఛ, సమానత్వం, హక్కులు, ప్రజాస్వామ్యం వంటి భావనలు ప్రపంచ రాజకీయ ఆలోచనలను ప్రభావితం చేశాయి. 19వ శతాబ్దంలో పారిశ్రామిక విప్లవం సంపద సృష్టి విధానాలను మార్చడమే కాకుండా కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, అసమానతలపై ప్రశ్నలను కూడా ముందుకు తెచ్చింది. సంపద సృష్టించిన పారిశ్రామికవేత్తలు చరిత్రలో నిలిచినా, సమాజం ఎలా ఉండాలనే దానిపై ప్రశ్నలు లేవనెత్తిన ఆలోచనాపరుల ప్రభావం మరింత విస్తృతమైంది. 20వ శతాబ్దం ఈ సత్యాన్ని మరింత బలంగా నిరూపించింది. రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలన అంతం, స్వాతంత్ర్య ఉద్యమాలు, ప్రజాస్వామ్య విస్తరణ, మానవ హక్కుల ఉద్యమాలు ప్రపంచాన్ని మార్చాయి. సామ్రాజ్యాలను సంపదతో నిర్మించిన అనేక మంది కాలగర్భంలో కలిసిపోయారు. కానీ స్వేచ్ఛ, సమానత్వం, శాంతి, మానవ హక్కుల కోసం ఆలోచించినవారు ప్రపంచ ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోయారు.

**భారతదేశ చరిత్రలోనూ ఇదే సత్యం కనిపిస్తుంది. భక్తి ఉద్యమం నుంచి సామాజిక సంస్కరణల వరకు, స్వాతంత్ర్యోద్యమం నుంచి రాజ్యాంగ నిర్మాణం వరకు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేసిన వ్యక్తులే తరతరాలకు ఆదర్శంగా నిలిచారు. కబీర్, గురునానక్, తుకారాం, రాజా రామ్మోహన్ రాయ్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వ్యక్తులను ప్రజలు కేవలం వారి వ్యక్తిగత జీవితాల వల్ల గుర్తుంచుకోవడం లేదు. వారి ఆలోచనలు సమాజాన్ని ప్రభావితం చేశాయి.**

డబ్బు కొనగలిగేది వస్తువు మాత్రమే; గౌరవాన్ని కొనలేదు. ఒక వ్యక్తి తన సంపదతో భవంతులు నిర్మించవచ్చు. వందల ఎకరాలు కొనవచ్చు. రాజకీయ ప్రభావాన్ని సంపాదించవచ్చు. ప్రచారాన్ని కొనవచ్చు. తన చుట్టూ ఉన్నవారిని కొంతకాలం తనకు అనుకూలంగా మార్చుకోవచ్చు. కానీ ప్రజల హృదయాల్లో శాశ్వతమైన గౌరవాన్ని డబ్బుతో కొనడం సాధ్యం కాదు. గౌరవం సంపాదించుకోవాలి. అది సేవతో వస్తుంది. జ్ఞానంతో వస్తుంది. నిజాయితీతో వస్తుంది. విలువలతో జీవించడం ద్వారా వస్తుంది.

సంపద విలువ కూడా కాలానుగుణంగా మారుతుంది. ద్రవ్యోల్బణం, ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ మార్పులు దాని విలువను ప్రభావితం చేస్తాయి. ఒక తరం కూడబెట్టిన ఆస్తి తరువాతి తరంలో విభజించబడవచ్చు. మూడో తరంలో కనుమరుగైపోవచ్చు. కానీ ఒక మంచి ఆలోచన తరతరాలకు ప్రయాణిస్తుంది. ఒక మంచి పుస్తకం రచయిత మరణించిన తరువాత కూడా చదవబడుతుంది. ఒక గొప్ప పరిశోధన దాని సృష్టికర్త జీవితాన్ని దాటి శాస్త్ర ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఒక సామాజిక సంస్కరణ ఆలోచన లక్షలాది జీవితాలను మార్చగలదు. ఒక మంచి ఉపాధ్యాయుడి మాట ఒక విద్యార్థి జీవితాన్ని మార్చి, ఆ విద్యార్థి ద్వారా మరో వందమందిపై ప్రభావం చూపవచ్చు. అందుకే జ్ఞానం, ఆలోచన, రచనలకు ఉన్న విలువను ఆర్థిక సంపదతో కొలవలేం. అయితే డబ్బు విలువలేనిదని చెప్పడం కూడా సరైంది కాదు. డబ్బు జీవనానికి అవసరం. విద్య, వైద్యం, పరిశోధన, వ్యాపారం, సంస్థల నిర్మాణం వంటి అనేక రంగాలకు సంపద అవసరం. అసలు ప్రశ్న డబ్బు ఉండటంలో లేదు; డబ్బును ఎలా ఉపయోగించామన్నదే అసలు ప్రశ్న.

ఒక వ్యక్తి తన సంపదతో ఆసుపత్రి నిర్మిస్తే, విద్యాసంస్థ స్థాపిస్తే, పరిశోధనకు సహకరిస్తే, పేదలకు అండగా నిలిస్తే ఆ సంపదకు సామాజిక విలువ వస్తుంది. ఒక పారిశ్రామికవేత్త సంపదను ఉద్యోగాల సృష్టికి ఉపయోగిస్తే, ఒక దాత విద్యకు తోడ్పడితే, ఒక సంపన్నుడు ప్రజా ప్రయోజనానికి సంస్థలను నిర్మిస్తే అతని పేరు సంపదతో కాదు, సేవతో గుర్తుండిపోతుంది. అంటే డబ్బు స్వయంగా చరిత్రను సృష్టించదు. డబ్బును ఉపయోగించిన విధానం చరిత్రలో గుర్తుండేలా చేస్తుంది. రచయిత పాత్ర ఈ సందర్భంలో ప్రత్యేకమైనది. రచయిత సమాజానికి కేవలం కథలు చెప్పేవాడు కాదు. అతను కాలానికి సాక్షి. సమాజంలోని లోపాలను ప్రశ్నించే వ్యక్తి. ప్రజల బాధలకు భాష ఇచ్చే వ్యక్తి. పాలకుల చర్యలను ప్రశ్నించే వ్యక్తి. భవిష్యత్తు తరాలకు వర్తమానాన్ని అందించే వ్యక్తి. ఒక మంచి రచయిత తన కాలాన్ని మాత్రమే రాయడు; తన కాలాన్ని చరిత్రకు అప్పగిస్తాడు. అతని కలం ఒక సమస్యను వెలుగులోకి తీసుకురావచ్చు. ఒక అన్యాయాన్ని ప్రశ్నించవచ్చు. ఒక బాధితుడి గొంతుకగా నిలవవచ్చు. ఒక విద్యార్థిని ప్రేరేపించవచ్చు. ఒక సమాజాన్ని ఆలోచింపజేయవచ్చు. ఒక వాక్యం ఒక ఆలోచనకు దారితీయవచ్చు. ఒక ఆలోచన ఉద్యమంగా మారవచ్చు. ఒక ఉద్యమం సమాజాన్ని మార్చవచ్చు. ఈ క్రమంలో రచయిత కలం ఒక సామాజిక శక్తిగా మారుతుంది.

**21వ శతాబ్దంలో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం పొందింది. డిజిటల్ ప్రపంచం ప్రతి వ్యక్తికి తన అభిప్రాయాన్ని ప్రపంచానికి తెలియజేసే అవకాశం ఇచ్చింది. సామాజిక మాధ్యమాలు మనిషికి అపారమైన కనిపించే అవకాశాన్ని ఇచ్చాయి. కానీ, కనిపించడం అంటే నిలిచిపోవడం కాదు. ప్రచారం అంటే ప్రభావం కాదు. అనుచరుల సంఖ్య అంటే ఆలోచన విలువ కాదు. ఒక వ్యక్తి ఒక రోజులో లక్షల మందికి కనిపించవచ్చు.**

కొన్ని రోజులు, కొన్ని నెలలు అతని పేరు చర్చలో ఉండవచ్చు. కానీ కాలం గడిచిన తరువాత ఆ ప్రజాదరణ మసకబారవచ్చు. మరోవైపు ఒక చిన్న పుస్తకం మొదట కొద్దిమందికే చేరినా, దశాబ్దాల తరువాత అది సమాజాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే తాత్కాలిక ప్రజాదరణకు, శాశ్వత ప్రభావానికి మధ్య ఉన్న తేడాను గుర్తించాలి. ఈ రోజుల్లో సమాచార పరిమాణం అపారంగా పెరిగింది.



కానీ సమాచారం ఎక్కువగా ఉండటం అంటే జ్ఞానం ఎక్కువగా ఉన్నట్టుకాదు. నిజాన్ని గుర్తించే సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన, తర్కం, నైతికత మరింత విలువైనవిగా మారాయి. ఒక వ్యక్తి దగ్గర ఎంత డబ్బు ఉందన్నదానికంటే, అతను సమాజానికి ఏమి ఆలోచింపజేశాడు అన్న ప్రశ్న ముఖ్యమవుతోంది. ప్రజలు గౌరవించేది సాధారణంగా మూడు విలువలను.. జ్ఞానం, సేవ, నైతికత. డబ్బున్న వ్యక్తిని సమాజం కొంతకాలం గౌరవించవచ్చు. అధికారంలో ఉన్న వ్యక్తిని కొంతకాలం భయపడవచ్చు. ప్రచారంలో ఉన్న వ్యక్తిని గుర్తించవచ్చు. కానీ జ్ఞానం ఉన్నవారిని తరతరాలు గౌరవిస్తాయి. సేవ చేసినవారిని ప్రజలు కష్టకాలంలో గుర్తు చేసుకుంటారు. విలువలతో జీవించినవారిని చరిత్ర ఆదర్శంగా నిలుపుతుంది. ప్రజల హృదయంలో స్థానం సంపాదించడం డబ్బుతో సాధ్యం కాదు. డబ్బుతో సభను ఏర్పాటు చేయవచ్చు. జనాన్ని సమీకరించవచ్చు. ప్రచారం చేయించుకోవచ్చు. కానీ ప్రజల మనసులో శాశ్వతమైన విశ్వాసాన్ని కొనలేం. అక్కడ స్థానం సంపాదించుకోవాలి. సేవతో సంపాదించుకోవాలి. నిజాయితీతో సంపాదించుకోవాలి. సమాజం కోసం చేసిన త్యాగంతో సంపాదించుకోవాలి.

20వ శతాబ్దంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన అనేక మంది వ్యక్తుల వారసత్వం ఇదే విషయాన్ని చెబుతుంది. శాస్త్రవేత్తలు, రచయితలు, సామాజిక సంస్కర్తలు, మానవ హక్కుల ఉద్యమకారులు, స్వాతంత్ర్య సమరయోధులు తమ ఆలోచనలతో ప్రపంచాన్ని ప్రభావితం చేశారు. వారి వ్యక్తిగత సంపద ఎంత అన్నది చరిత్రకు ప్రధాన విషయం కాదు. వారి ఆలోచనలు మానవ సమాజాన్ని ఎలా మార్చాయన్నదే ముఖ్యం. భారత స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ ప్రభావం కేవలం రాజకీయ నాయకత్వం వల్ల ఏర్పడలేదు. సత్యం, అహింస, స్వరాజ్యం, సామాజిక బాధ్యత వంటి భావాలను ప్రజా ఉద్యమాలుగా మార్చగలిగిన ఆలోచనా శక్తి ఆయనకు ఉంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రభావం కూడా ఇదే కారణంతో శాశ్వతమైంది. ఆయన న్యాయవేత్త, ఆర్థికవేత్త, సామాజిక తత్వవేత్త, రచయిత, రాజ్యాంగ నిర్మాతగా సమానత్వంపై చేసిన ఆలోచనలు భారతదేశ సామాజిక, రాజకీయ జీవితాన్ని ప్రభావితం చేశాయి. చరిత్రలో నిలిచిపోవడం అంటే కేవలం ప్రసిద్ధి చెందడం కాదు. ఒక వ్యక్తి పేరు ఎందుకు గుర్తుండిపోయింది అన్నదే అసలు ప్రశ్న. కొందరు భయంతో గుర్తుండవచ్చు. కొందరు సంపదతో గుర్తుండవచ్చు. కొందరు అధికారంతో గుర్తుండవచ్చు. కానీ అత్యంత విలువైన జ్ఞాపకం గౌరవంతో కూడినది. ఆ గౌరవం ప్రజల జీవితాలను మెరుగుపరిచిన వారికే లభిస్తుంది. అందుకే విజయాన్ని కొలిచే ప్రమాణాలను కూడా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. ఎంత సంపాదించాం? అనే ప్రశ్నతో పాటు ఎంత సృష్టించాం? ఎంతమందికి ఉపయోగపడ్డాం? ఎంత మంచి ఆలోచన ఇచ్చాం? ఎంత మంచి మార్పుకు కారణమయ్యాం? అనే ప్రశ్నలు కూడా అడగాలి. మనిషి పుట్టినప్పుడు అతని వద్ద సంపద ఉండదు. జీవితంలో సంపాదిస్తాడు. మరణించే సమయంలో ఆ సంపదను వెంట తీసుకెళ్లలేడు. కానీ అతని జీవితం సమాజానికి ఇచ్చిన విలువలు మిగిలిపోతాయి. ఒక కోటీశ్వరుడు తన వారసులకు ఆస్తిని వదిలి వెళ్లవచ్చు. ఒక శాస్త్రవేత్త ప్రపంచానికి జ్ఞానాన్ని వదిలి వెళ్లవచ్చు. ఒక సంస్కర్త సమాజానికి కొత్త దిశను వదిలి వెళ్లవచ్చు. ఒక రచయిత తరతరాలకు ఆలోచనలను వదిలి వెళ్లవచ్చు. మొదటి సంపద తరాలకు పంచబడుతుంది. రెండవది మానవజాతికి పంచబడుతుంది. చివరికి కాలం అందరినీ ఒకే స్థాయిలో నిలబెడుతుంది. రాజు అయినా, ధనవంతుడు అయినా, అధికారి అయినా, సామాన్యుడు అయినా మరణం ముందు సమానమే. కానీ మరణం తరువాత ఎవరి పేరు నిలుస్తుందో వారి జీవితం నిర్ణయిస్తుంది. తమ కోసం జీవించినవారు కుటుంబ జ్ఞాపకాల్లో మిగిలిపోవచ్చు. సమాజం కోసం జీవించినవారు ప్రజల జ్ఞాపకాల్లో నిలుస్తారు. మానవజాతి కోసం ఆలోచించినవారు చరిత్రలో నిలుస్తారు. అందుకే మనిషి జీవితానికి చివరి లెక్క బ్యాంకు ఖాతాలో ఉండదు. అది ప్రజల జ్ఞాపకాల్లో ఉంటుంది. అతని నిజమైన సంపద ఆస్తిలో ఉండదు. అతని పేరు పలికినప్పుడు ప్రజల హృదయంలో కలిగే గౌరవంలో ఉంటుంది. అతని నిజమైన వారసత్వం భవనాల్లో ఉండదు. అతని ఆలోచనల్లో ఉంటుంది.

అందుకే 15వ శతాబ్దం నుంచి 21వ శతాబ్దం వరకు చరిత్ర మనకు అందించే తుది సత్యం ఒక్కటే.. ప్రజలు చివరికి డబ్బున్నవారిని కాదు, విలువ ఉన్నవారిని గుర్తుంచుకుంటారు; అధికారంలో ఉన్నవారిని కాదు, సమాజానికి అర్థవంతమైన మార్పు తీసుకొచ్చినవారిని గౌరవిస్తారు; జీవించినవారిని మాత్రమే కాదు, తమ ఆలోచనలతో భవిష్యత్తును నిర్మించినవారిని చరిత్ర చిరస్థాయిగా నిలుపుతుంది. మనిషి ఎంత సంపాదించాడు అన్నది అతని జీవిత పరిమాణాన్ని చెబుతుంది. తన జీవితంతో ప్రపంచానికి ఎంత ఇచ్చాడు అన్నదే అతని విలువను చెబుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMARfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004